విశాఖపట్టణం
గురువారం 9 అక్టోబర్ 2025
For a pure tomorrow..
జయ జయహే
jayajayahey.in సంపుటి: 8 సంచిక: 250 వెల: రూ.5/- పేజీలు: 12
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# రోడ్లకు మహర్దశ

### మరమ్మతులకు నిధుల విడుదల

### రూ. 1000 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



**అమరావతి, జయజయహే**

రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ఎన్డీయే ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించేందుకు రూ.1000 కోట్ల నిధులను ..మిగతా 2లో



# బంగారం దూకుడు

### రోజురోజుకు సరికొత్త రికార్డు

### తాజాగా రూ.1.25 లక్షలకు చేరిక

**ప్రత్యేకప్రతినిధి, జయజయహే**

ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర రోజుకో సరికొత్త రికార్డును నమోదు చేస్తోంది. మొన్నటి వరకు 10 గ్రాముల ధర రూ.లక్ష దాటితేనే ఔరా అనుకున్న వాళ్లంతా.. తాజాగా రూ.1.25 లక్షలకు చేరుకోవడం చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అంతర్జాతీయంగానూ పుత్తడి ఔన్సు తొలిసారి 4వేల డాలర్ల మార్కును దాటింది. అమెరికా ..మిగతా 2లో

# కూటమికి స్త్రీ శక్తి సెగ

### మహిళలకు లబ్ధి.... ఖజానాకు భారం

### నెలకు రూ. 150.... ఏటా 18 వందల కోట్ల భారం

### అన్ని వర్గాల నుంచి అసంతృప్తి సెగలు






**అనకాపల్లి, జయజయహే**

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన స్త్రీ శక్తి పథకం దుమారం రేపుతోంది. దాదాపు అన్ని రాజకీయపార్టీలు ఈ పథకంపై విమర్శలు చేస్తుండగా కూటమి శ్రేణులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తుడడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఫెయిల్ అయిన ఈ పథకాన్ని ఈ రాష్ట్రంలో ఎందుకు అమలు చేసారో చంద్రబాబుకే ఎరుక. పథకం అమలు అయిన నెలరోజులలో పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులు, స్టూడెంట్స్, చివరకు ఆర్టీసీ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. బస్ ఫ్రీ అనేసరికి మహిళలు తండోప తండాలుగా ఎగబడుతుండడంతో టిక్కెట్లు కొనుక్కుని ప్రయాణం చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే స్టూడెంట్స్ కూడా కిక్కిరిసిన బస్సులలో పాఠశాలలకు వెళ్లలేక ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు బస్సులలో మహిళల మధ్య కొట్లాటలు, ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల పై కూడా మహిళలు దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక మహిళా కండక్టర్ బాహాటంగా నిరశన తెలపడం, ఆర్టీసీ అధికారులు ఆమెపై చర్యలకు ఉపక్రమించడం, ఆర్టీసీ యూనియన్ లు సదరు మహిళా కండక్టర్ కు అండగా నిలవడంతో అధికారులు వెనుక అడుగు వేసారు. బస్ లు రద్దీ కారణంగా పుట్ బోర్డుపై వేలాడుతూ ప్రయాణాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు ? ఆర్టీసీ సిబ్బంది పై చర్యలు తీసుకుంటారా ? అనకాపల్లి జిల్లా వరకూ చూస్తే నెల రోజుల్లో 14,86,513 మంది ఉచిత ప్రయాణం చేసారు. ఆర్టీసీ బస్సుల్లో ..మిగతా 2లో



# కోనసీమలో ఘోరం

### బాణసంచా పరిశ్రమలో పేలుడు

### ఏడుగురు దుర్మరణం

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మోడీ, బాబు

**కాకినాడ, జయజయహే**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఈ ఘటనలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే రాయవరం బాణసంచా దుర్ఘటనలో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ..మిగతా 2లో

# జాతీయ భద్రతలో కాంగ్రెస్ రాజీ

### ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు

### ప్రతీకారం తీర్చుకోకుండా అడ్డుకున్నదెవరు

### తమకు జాతీయ భద్రతే ముఖ్యమన్న ప్రధాని మోడీ



**ప్రత్యేకప్రతినిధి, జయజయహే**

2008 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 'బలహీనత'ను ప్రదర్శించిందని ప్రధాని మోడీ ఆరోపించారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ..మిగతా 2లో



# నేడు విశాఖకు జగన్

### మాకవరపాలెం మెడికల్ కాలేజీ సందర్శన

### కేజీహెచ్ లో కామెర్ల బాలిక బాధితులకు పరామర్శ

**ప్రత్యేకప్రతినిధి, జయజయహే**

మాజీ సీఎం వైఎస్ జగన్ ఉత్తరాంధ్ర పర్యటన షెడ్యూల్ ను వైఎస్ఆర్సీపీ ప్రోగ్రాం కోర్డినేటర్, ఎంఎల్సీ తలశిల రఘురాం విడుదల చేశారు.

**ఇదే షెడ్యూల్..**

రేపు మాజీ సీఎం వైఎస్ జగన్ విశాఖ , అనకాపల్లి జిల్లాల్లో పర్యటన. ఉదయం 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఎన్ ఏ డి జంక్షన్, వేపగుంట, పెందుర్తి మీదుగా కొత్తూరు జంక్షన్ చేరుకుంటారు. తాళ్లపాలెం జంక్షన్ మీదుగా మాకవరపాలెం చేరుకుంటారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ ..మిగతా 2లో

## రూ.1.14 లక్షల కోట్ల

# పెట్టుబడులకు ఆమోదం

### భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులు

### కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలి

### సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

### పెట్టుబడులకు ఎస్ ఐ పీ బీ ఆమోదం



**ప్రత్యేకప్రతినిధి, జయజయహే**

11వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. మూడు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా లోతైన చర్చ జరిగింది. భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారుల నియామకానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోనున్నారు. ఐటీ, ఇంధనం, టూరిజం, ..మిగతా 2లో

# మయన్మార్‌లో విషాదం

### బౌద్ధ ఉత్సవంపై బాంబులతో దాడి

### 24 మంది మృత్యువాత.. 47 మందికి తీవ్ర గాయాలు

**ప్రత్యేకప్రతినిధి, జయజయహే**

మయన్మార్‌లో విషాదం చోటుచేసుకుంది. బౌద్ధ ఉత్సవం పై పారాగ్లైడర్ బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 24 మంది మృతి ప్రాణాలు కోల్పోయారు. 47 మంది గాయపడ్డారు. గుమిగూడిన జనంపై ..మిగతా 2లో



# 13న సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభం

### శాశ్వత ప్రధాన కార్యాలయానికి శ్రీకారం

### 3.62 ఎకరాల్లో 7 అంతస్తుల భవనం

**అమరావతి, జయజయహే**

సీఆర్డీఏ శాశ్వత ప్రధాన కార్యాలయం అక్టోబర్ పదమూడో తేదీన ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్డీఏ) శాశ్వత ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అక్టోబర్ 13న ప్రారంభించనున్నారు. రాయపూడి ప్రాంతంలో 3.62 ..మిగతా 2లో



For a pure tomorrow... జయహో

# జాతీయ భద్రతలో కాంగ్రెస్ రాజీ

మొదటి పేజీ తరువాయి...

ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు. ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు.

ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురించి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడుల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదే పదే ఉగ్రవాదానికి మూల్యం



చెల్లించాల్సి వచ్చిందని అన్నారు.

ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వానికి దేశం, దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై తమ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు.మన దేశ భద్రత, పౌరుల భద్రత కన్నా మరేది ముఖ్యం కాదని మోదీ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రస్తావిస్తూ, నేటి భారతదేశం తన శత్రువులను వారి ఇళ్లలోకే వెళ్లి హతమారుస్తోందని ప్రధాని అన్నారు. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ 'వికసిత్ భారత్'ను ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని ప్రధాని అన్నారు. కొత్త విమానాశ్రయం ద్వారా మహారాష్ట్రలోని రైతుల ఉత్పత్తులు మిడిల్ ఈస్ట్, యూరప్ మార్కెట్లతో అనుసంధానించబడుతాయని చెప్పారు.



# కోనసీమలో ఘోరం

మొదటి పేజీ తరువాయి...

అగ్నిప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. మరోవైపు ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు సరిహద్దులో ఈ ఘటన జరిగిందన్నారు. 70 సంవత్సరాలుగా బాణాసంచా తయారీలో శ్రీ లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తికి అనుభవం ఉందన్నారు. ఆయన కూడా ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. కాసేపట్లోనే హోంమంత్రి వంగలపూడి అనిత ఘటనా స్థలానికి చేరుకుంటారని తెలిపారు. నిబంధనలన్నీ కచ్చితంగా పాటించారని ఇటీవల అధికారుల తనిఖీల్లో వెల్లడయిందన్నారు. అయినప్పటికీ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# రోడ్లకు మహర్దశ

మొదటి పేజీ తరువాయి...

మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 274 రహదారుల మరమ్మతు పనులు ఈ కేటాయింపులో భాగంగా చేపట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ. కృష్ణబాబు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని రోడ్ల స్థితి, వర్షాల ప్రభావం, ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఇందులో భాగంగా.. స్టేట్ హైవేల్లో 108 రహదారి పనులకు రూ.400 కోట్లు, జిల్లా రహదారుల్లో 166 పనులకు రూ.600 కోట్లు మంజూరు చేసింది. వీటితో పాటు పాత రహదారుల పునరుద్ధరణతో పాటు డ్రైనేజీ సదుపాయాల మెరుగుదల, కొత్త సిమెంట్ రోడ్లు, బైపాస్ మార్గాలను ఆధునీకరించడం వంటి అంశాలు కూడా ప్రాధాన్యంగా తీసుకుంటామని రహదారులు, భవనాల శాఖ అధికారులు తెలిపారు.

ఇటీవలి వర్షాలతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో రహదారులు దెబ్బతినడం, గుంతలు పడటం, రవాణా సమస్యలు తీవ్రంగా ఎదురవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పలు మార్గాల్లో రహదారుల దుస్థితి పెరిగింది. ప్రభుత్వం ఈ నిధుల కేటాయింపుతో రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, సంబంధిత శాఖలు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# అమృత ఆరోగ్య పథకం విస్తరణ

## -వృద్ధులు, నిరాశ్రయులు, అనాథలకు మరో శుభవార్త

## -రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రత్యేకప్రతినిధి, జయజయహే

రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అనాథలు, నిరాశ్రయులు, వృద్ధుల కోసం అమలు చేసే "అమృత ఆరోగ్య పథకం" విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,812 మందికి అమృత ఆరోగ్య పథకం వర్తింపజేస్తోంది. అదనంగా 1,113 మంది అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులకు అమృత ఆరోగ్య పథకం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు సూచించారు. ప్రస్తుతం ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2,812 మంది ఉన్నారు గుర్తించిన వారందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందనున్నాయి. అమృత ఆరోగ్య పథకం కింద 1,044 థెరపీలు , సర్జరీలు సహా ఏడాదికి రూ. 2.50 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో అనాథలు, నిరాశ్రయులైన వారికి, వృద్ధులకు "అమృత ఆరోగ్య పథకం" ద్వారా మరిన్ని వైద్య సేవలు దక్కనున్నాయి.

# కూటమికి స్త్రీ శక్తి సెగ

మొదటి పేజీ తరువాయి...

ఉచిత ప్రయాణానికి ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకుంటున్నారు అందులో అనుమానం లేదు. ఈ పథకం ప్రారంభించిన తరువాత నెల రోజుల్లో జిల్లాలోని రెండు డిపోల నుంచి నడుస్తున్న బస్సుల్లో 14 లక్షల 86 వేల 513 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం సాగించారు. వీరికి రూ.5.35 కోట్ల లబ్ధి చేకూరింది. అంటే పరోక్షంగా రాష్ట్ర ఖజానాపై 5.35 కోట్ల భారం పడినట్లే. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఈ భారం పరిగణలోకి తీసుకుంటే ఒక నెలకు సుమారు 150 కోట్ల రూపాయల మేరకు ఖజానాపై భారం పడుతుందని అంచనా. ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. కొన్ని రూట్లలో ఓఆర్ వంద శాతం దాటిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15వ తేదీన స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి నడుస్తున్న పల్లె వెలుగు అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, ఆర్డినరీ, మెట్రో కేటగిరీలకు చెందిన బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించారు. అనకాపల్లి డిపో నుంచి 60 బస్సుల్లో 8,36,315 మంది మహిళలు, నర్సీపట్నం

డిపో నుంచి 72 బస్సుల్లో 5,47,198 మంది మహి ళలు ప్రయాణించారు. జీరో ఫేర్ టికెట్ ప్రకారు ఈ నెల రోజుల కాలంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడం ద్వారా మహిళలకు 5.35 కోట్ల లబ్ది చేకూరింది. కాగా స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 70 శాతం ఉండగా.. ఈ పథకం అమలులోకి వచ్చిన తరువాత 94 శాతానికి, అనకాపల్లి. డిపోలో శత శాతం ఓఆర్ నమోదు కావడం గమనార్హం.

### రాష్ట్ర ఖజానాకు 150 కోట్ల భారం....

స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రభుత్వానికి నెలకు సుమారు 150 కోట్ల భారం పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో ఇంత రచ్చ రచ్చ అవుతున్న పథకం మరొకటి లేదనే చెప్పాలి. నూటికి 99 శాతం పురుషులు ఈ పథకంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు,



వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులలో సైతం అసంతృప్తి కనిపిస్తుంది. రాష్ట్ర ఖజానాకు జగన్ పెద్ద బొక్క పెట్టారని, పొదుపు పాటిస్తూ, నిధులు దుర్వినియోగం చేయకుండా అభివృద్ధి బాటలో నడవాలని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రాష్ట్రాలలో ఫెయిల్ అయి ఆర్థిక భారాలు మోయలేక సతమతమౌతున్న ఈ పథకాన్ని ఎందుకు అమలు చేసారన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు. పోనీ మహిళలు ఏమైనా సంతృప్తిగా ఉన్నారా ? అంటే అదీ లేదు. కేవలం 35 శాతం మహిళలు మాత్రమే ఎడా పెడా ఈ పథకాన్ని వాడేసుకుంటున్నారు. మిగిలిన 65 శాతం మంది మహిళలు ఈ పథకంపై పెదవి విరుస్తున్నారు. అంటే కేవలం 35 శాతం మంది మహిళలను సంతృప్తి పరచడానికి ఏటా 18 వందల కోట్ల రూపాయలను వెచ్చించడం విశేషం. పోనీ ఈ 35 శాతం మంది మహిళలు కూటమి పార్టీలకు ఓట్లు వేస్తారా? అంటే అదీ గ్యారెంటీ లేదు. గతంలో మహిళలను ఆకట్టుకోవడానికి ఎన్నికల ముందు పసుపు కుంకుమలు పంచడం, సదరు ఎన్నికల్లో మహిళలు అదే పసుపును ఈ పచ్చపార్టీకి పూసి ఓడించిన విషయం అందరికీ తెలిసిందే. ఇంత పనికిమాలిన పథకాన్ని తమ నాయకుడు ఎందుకు ప్రవేశ పెట్టారో అర్థం కావడంలేదని తెలుగు దేశం పార్టీ శ్రేణులు కూడా జుత్తు పీక్కుంటున్నారు. మహిళా ఉద్యోగులు ద్వారా గణనీయమైన ఆదాయం వచ్చేది. ఇపుడు వారు కూడా ఆధార్ కార్డు తో ప్రయాణాలు సాగిస్తున్నారు. అసలే ఆర్టీసీ ఆర్థిక భారంతో కుదేలు అయి ఉంటే చంద్రబాబు తీసుకున్న నిర్ణయం ప్రకంపనలు సృష్టిస్తోంది.

# 13న సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

ఎకరాల్లో నిర్మితమైన ఈ 7 అంతస్తుల భవనం, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌తో పాటు అధునాతన సౌకర్యాలతో అమరావతి అభివృద్ధికి కేంద్ర హబ్‌గా మారనుంది.

రాయపూడి ప్రాంతంలో 3.62 ఎకరాల స్థలంలో నిర్మితమైన ఈ భవనం, మొత్తం 2.42 లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. భవనం జీం7 (గ్రౌండ్ ం 7 అంతస్తులు) రూపంలో ఉంది, అంటే మొత్తం 8 అంతస్తులు. ప్రతి అంతస్తులో అధికారుల కెబిన్‌లు, ఉద్యోగుల వర్క్‌స్టేషన్‌లు, కామన్ ఫెసిలిటీలు అలాగే విస్తృత ఇంటీరియర్ డిజైన్‌తో ప్రణాళికాబద్ధంగా నిర్మించారు. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులను రియల్-టైమ్‌లో మానిటర్ చేయడానికి అధునాతన కమాండ్ సెంటర్. ఇది సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్ వంటి విభాగాలకు కోఆర్డినేషన్ ప్లాట్‌ఫాంగా ఉపయోగపడుతుంది.

ఎలక్ట్రికల్ ఫిటింగ్స్, ఇంటీరియర్ వర్క్‌లు, ల్యాండ్‌స్కేపింగ్, మోడరన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పని చేసే వాతావరణాన్ని సిద్ధం చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి పొంగురు నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ కెబిన్‌లు. అన్ని మున్సిపల్ (హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్) ఆఫీసులు ఈ కార్యాలయంలో ఉంటాయి. ఈ భవనం అమరావతి క్యాపిటల్ సిటీ



అభివృద్ధికి కేంద్ర యూనిట్‌గా పనిచేస్తుంది.

2014లో మొదలైన ఈ ప్రాజెక్ట్ 2019 వరకు 50% పూర్తి అయింది, కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక నిలిపివేశారు. 2024లో మళ్లీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రాజెక్ట్‌ను ప్రాధాన్యత ఇచ్చి వేగవంతం చేశారు. అక్టోబర్ 13న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ భవనాన్ని ప్రారంభిస్తారు. ప్రారంభం తర్వాత, సీఆర్‌డీఏ, ఏ డీ సీ ఎల్ , సీడీ ఏం ఏ వంటి విభాగాలు, మున్సిపల్ ఆఫీసులు, హెచ్ ఓ డీలు ఈ భవనానికి మారుస్తారు. ప్రస్తుతం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఉన్న సీఆర్‌డీఏ తాత్కాలిక కార్యాలయాన్ని మెప్మాకు అప్పగించనున్నారు.



# బంగారం దూకుడు

మొదటి పేజీ తరువాయి...

ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్, ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై నెలకొన్న అనిశ్చితులు పసిడికి తాజాగా డిమాండ్ పెంచుతున్నాయి. బంగారం ధర బుధవారం మరింత పెరిగింది. ఒక్కరోజే రూ.2,290 పెరిగి ఆల్‌టైమ్ హైకి చేరింది. బుధవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర తొలిసారి రూ.1,26,070కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,750కి చేరింది. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.58 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. పసిడి ధరలు పెరగడానికి అనేక కరాణాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా పేర్కొంటున్నాయి. వడ్డీరేట్లను ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఇంకా తగ్గిస్తుందన్న అంచనాల మధ్య మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనమైన పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీంతో పసిడి ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,780 వద్ద కొనసాగు తోంది. 22 క్యారెట్ల పసిడి రూ.1,12,900 పలుకుతోంది. అటు వెండి సైతం కిలో రూ.1.56 లక్షలు దాటింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 48.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది.అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యంపై టారిఫ్‌ల ప్రభావం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, కేంద్ర బ్యాంకులు కొనుగోళ్ల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పుత్తడి వైపు పెట్టుబడులు మళ్లడమే దీనికి కారణం. దాదాపు రెండేళ్లక్రితం ఔన్సు బంగారం ధర 2 వేల డాలర్ల దిగువనే ఉండేది. అలాంటిది ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలోనే దాదాపు 50 శాతం మేర పెరగడం గమనార్హం. ఈ పెరుగుదలతో పసిడి కొనుగోళ్లకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. పండగ సీజన్‌లో వ్యాపారాలు తగ్గడంతో ఆభరణ వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# మయన్మార్‌లో విషాదం

మొదటి పేజీ తరువాయి...

రెండు బాంబులు వేయడంతో 24 మంది చనిపోయారని జుంటా వ్యతిరేక పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన స్థానిక అధికారి తెలిపారు. 47 మంది గాయపడ్డారని చెప్పారు. బౌద్ధ మూలాలతో కూడిన జాతీయ సెలవుదినం అయిన థాడింగ్యుట్ పండుగ కోసం సోమవారం సాయంత్రం చాంగ్ యు టౌన్‌షిప్‌లో సుమారు 100 మంది గుమిగూడి ఉండగా ఈ దాడి జరిగింది. థాడింగ్యుట్ పండుగను లైట్ల పండుగ అని కూడా పిలుస్తారు. మయన్మార్ అంతటా కొవ్వొత్తులు, లాంతర్లు. సామూహిక సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశం సైనిక నిర్బంధం, రాబోయే ఎన్నికలను నిరసిస్తూ.. అలాగే ఆంగ్ సాన్ సూకీతో సహా రాజకీయ ఖైదీల విడుదల కోసం కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. 2021 తిరుగుబాటులో సైన్యం అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి మయన్మార్ అంతర్యుద్ధంలో కొట్టుమిట్లాడుతోంది. అప్పటి నుంచి 5,000 మందికి పైగా పౌరులు మరణించారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా విమానాలు, జెట్ ఇంధన కొరత మధ్య తరచుగా ఆకాశం నుంచి మోర్టార్ తూటాలను జారవిడిచే పారామోటర్ దాడులను సైన్యం ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో కూడా చాంగ్ యు టౌన్‌షిప్‌లో కూడా ఇలాంటి దాడులు జరిగినట్లుగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదించింది. ఇక సైన్యం తిరుగుబాటు తర్వాత మొదటిసారిగా డిసెంబర్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి.

# నేడు విశాఖకు జగన్

మొదటి పేజీ తరువాయి...

కాలేజ్ ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతారు. అనంతరం విశాఖ కెజిహెచ్ కి చేరుకుని మన్యం జిల్లా కు చెందిన పచ్చకామెర్ల బాధిత విద్యార్థినులను పరామర్శిస్తారు.



# రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి...

ఎరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. వీటి ద్వారా 67 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి 11వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్‌కు కు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎఫ్‌డీఐ రాలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్ ఏర్పాటు కొత్త చరిత్రను లిఖిస్తుందని ఎస్ఐపీబీ సమావేశం పేర్కొంది. అతిపెద్ద ఫారిన్ ఇన్వెస్టిమెంట్ సాధించడంపై ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అభినందనలు తెలియజేశారు. 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ. 7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. దీని ద్వారా 6.20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

# హద్దు మీరితే తోక కట్ చేస్తాం

**-అప్పుడు బాబు, పవన్ ను అడ్డుకోలేదా**

**-మేము అలా చేయలేము**

**-భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యలు**

**విశాఖపట్నం, జయజయహే**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గురువారం జగన్ విశాఖకు వచ్చి నర్సీపట్నం మెడికల్ కాలేజ్‌కు వెళ్తామని అంటున్నారని.. ఎయిర్ పోర్ట్ నుంచి నర్సీపట్నం వరకు 63 కిలో మీటర్లు రోడ్ షో వేయాలని వైసీపీ ప్లాన్ చేసిందన్నారు. చాలా దూరం కాబట్టి హెలికాప్టర్‌లో వెళ్ళమని పోలీసులు చెప్పారని తెలిపారు. వైసీపీ హయాంలో పాలన ఎలా జరిగిందో అందరికీ తెలిసిందే అని చెప్పుకొచ్చారు. ఎయిర్ పోర్ట్‌లో ఆనాడు చంద్రబాబును అడ్డుకున్నారని.. పవన్ కళ్యాణ్‌ను అడ్డుకున్నట్లు తాము చేయగలమన్నారు. కానీ అలా చేయమని.. జగన్ పర్యటనకు అనుమతులు ఇచ్చామన్నారు. గతంలో కూడా ఏపీలో చాలా చోట్ల జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని.. ఎలాంటి సంఘటనలు జరిగాయో అందరికీ తెలుసని మాజీ మంత్రి అన్నారు. జగన్ తన పర్యటనలో లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. విశాఖలో మహిళల క్రికెట్ మ్యాచ్ ఉ ందని... ఇటువంటి సమయంలో జగన్ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు కట్టాలని అనుకున్నారని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కాలేజ్ పునాది స్థాయిలో ఉంటే.. వైసీపీ కార్యాలయాలు మాత్రం మహారాజ ప్యాలెస్‌లా కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రుషికొండలో ప్రజా ధనంతో ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. జగన్ కల్తీ మద్యం కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని దుయ్యబట్టారు. తమిళనాడులో విజయ్ కార్యక్రమంలో 40 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటే.. మక్కెలు ఇరగ కొడతామని మాజీ మంత్రి హెచ్చరించారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారని.. నిబంధన ఉ ల్లంఘిస్తే చట్టం తన పని చేసుకుపోతుందన్నారు. జగన్ వి వీకెండ్ రాజకీయాలని విమర్శించారు. దేని కోసం కోటి మందితో సంతకాలు చేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వం కాదన్నారు. జగన్‌కు అక్కడికి వెళ్లడానికి సిగ్గు ఉండాలని విమర్శించారు. హద్దు మీరితే... తోక ఎలా కట్ చేయాలో చంద్రబాబుకు తెలుసన్నారు. ఇటీవల పెద్దిపాలెంలో ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు అత్యంత రహస్యంగా మీటింగ్ పెట్టారని.. అంత రహస్యంగా సమావేశాన్ని ఎందుకు పెట్టాల్సి వచ్చిందో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.



# ప్రతిపక్షం దిగజారిపోయింది

**ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

**రాజమహేంద్రవరం, జయజయహే:**

రాష్ట్రంలో ప్రతిపక్షం దిగజారిపోయిందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం రాజమండ్రి క్వారీ సెంటర్ లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ప్రతిపక్ష హోదా కావాలని జగన్ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ముందంజలో ఉందన్నారు. కూటమి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, దీంతో జగన్ ప్రజలను మభ్య పెట్టేందుకు, కల్లోలం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగడం మాని ప్రజా సమస్యలపై పోరాడితే బాగుంటుందని అన్నారు. అలాగే కేంద్రం లోని మోడీ సర్కారు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. మోడీ సంస్కరణలతో భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. ప్రస్తుతం స్వదేశీ వస్తువులను ప్రజలంతా వినియోగించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నర్సిపల్లి హారిక, రజని, నాగరాజు, లక్ష్మీ ప్రసన్న, రంగబాబు, విజయలక్ష్మి, ఉమ, వీర వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో ముద్దాయికి 10 ఏళ్లు కఠిన కారాగార శిక్ష, లక్ష జరిమానా

**జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**

**చోడవరం, జయజయహే**



గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు ప్రగాఢ గణేష్ కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ?1,00,000/- జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో 2 సంవత్సరాలు 6 నెలల అదనపు సాధారణ జైలు శిక్షను కూడా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి హరి నారాయణ బుధవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాలు పరిశీలిస్తే మాడుగుల మండలం ముకుంద పురం గ్రామానికి చెందిన ప్రగాఢ గణేష్ ,( 38,) 2015 నవంబర్ 11వ తేదీ ఉ దయం 10 గంటల సమయంలో చోడవరం అప్పటి ఎస్సై బి రమణయ్య అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి చోడవరం కొత్తూరు జంక్షన్ వద్దకు వెళ్లగా అక్కడ పై ముద్దాయి తన కారు ఏపీ 05 ఏపీ 2799 లో 5 గోనే బస్తాలు పెట్టి ఉండగా పోలీస్ వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నం చేశాడు. వెంటనే అతడినే వెంబడించి పట్టుకున్నారు వారి వద్ద 100 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు చోడవరం పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 153/2015 నమోదు చేసారు. నిందితులు పాడేరు చుట్టుపక్కల ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి గోనే బస్తాలు కారు లో వస్తుండగా పై నిందితుడు ,పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అప్పటి ఎస్సై బి రమణయ్య దర్యాప్తు జరిపి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు .వెంకటరావు న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారనీ, సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయస్థానం నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ?1,00,000/- జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 2 సంవత్సరాలు 6 నెలల అదనపు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు పేర్కొన్నారు. దీంతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై బి రమణయ్య ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.వెంకటరావు, చోడవరం పోలీసులకు కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందికి ఈ విజయానికి చేసిన కృషికి అభినందనలు తెలిపారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం

**అడ్వకేట్ డాక్టర్. జీ.మోహన్**

**శ్రీకాకుళం, జయజయహే**



సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడి యత్నాన్ని శ్రీకాకుళం అడ్వకేట్ డాక్టర్. జీ.మోహన్ తీవ్రంగా ఖండించారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి సీజెఐపైకి బూటు విసరడానికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన, అప్రజాస్వామ్యమైన చర్యగా పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. "సీజెఐపై దాడి యత్నం అంటే, ఒక వ్యక్తిపై దాడి కాదని, భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ గౌరవం, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేసినట్లేనని అడ్వకేట్ మోహన్ అన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సుప్రీం కోర్టు ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు.

# ప్రజలను వేదిస్తున్న శ్వాస కోస వ్యాధులకు కారణం ఎవరు?

**జనావాసాలా మధ్య పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఖర్కాణాలు**

**సాలూరు, జయజయహే**

సాలూరులో నివసించే ప్రజలు కేవలం పొగతాగడం వల్ల కాకుండా పెరిగిపోతున్న వాయు కాలుష్యం కారణంగా కూడా లంగ్స్ క్యాన్సర్‌కు గురవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. వైద్య నిపుణుల ప్రకారం.గతంతో పోలిస్తే పొగతాగని వారిలో కూడా లంగ్ క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగాయి. దీనికి ప్రధాన కారణం పట్టణంలో ఉన్న ప్రమాదకరమైన వాయు కాలుష్యమే.పట్టణంలో పుట్టగొడుగుల్లా కార్కానాలు పెరిగిపోతున్నాయి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాయు కాలుష్యాన్ని తగ్గించటం కోసం గ్యాస్ వినియోగాన్ని పెంచడం కొరకు అనేక పథకాలతో చిన్న మధ్య తరగతి ప్రజలకు అవగాహనా కల్పిస్తూ వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది.కానీ సాలూరు పట్టణం మధ్యలో ఎటువంటి అనుమతులు లేకుండా కార్కానాలను ఏర్పాటు చేసి తీవ్రమైన పొగతో పట్టణంలోని ప్రజల అనారోగ్యానికి కారకులవుతున్న అధికారులు తీసుకుంటున్న చర్యలు మాత్రం సూన్యం.పట్టణంలోని ప్రదేశంలో పెద్ద పెద్ద పొగ పొయ్యిలను ఏర్పాటు చేసి నిత్యం విపరీతమైన పొగను వదిలి వాయు కాలుష్యానికి కారణం అవుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి అని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బంగారమ్మ కాలనీలో ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారి కార్కానా వలన వాయు కాలుష్యం అవుతుంది అని అధికారులు చర్యలు తీసుకున్నపుడు.పట్టణం నడిబొడ్డులో ఉన్న కార్కానాలపై ఎందుకు చర్యలు తీసుకోవటంలేదు అనే దానిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.ఇప్పటికే సాలూరు పట్టణంలోని రహదారులు పై దుమ్ము దూళితో అనేక మంది శ్వాసకోస వ్యాధులతో బాధపడుతుంటే పుండు మీద కారం చల్లినట్టు ఇపుడు పట్టణంలో పెరిగిపోతున్న కార్కానాలవలన తీవ్ర వాయుకాలుష్యం ఏర్పడుతుంది.ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని జనావాసాల మధ్య నుంచి పట్టణ శివారు ప్రదేశాలకు లేదా పూర్తిగా వాయు కాలుష్యానికి కారణం అవుతున్నటువంటి పొగ పొయ్యిల వినియోగానికి అడ్డుకట్టట వెయ్యాలి అని పట్టణ ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



చిన్నబజార్ నిత్యం ప్రజలతో కిటకిటలాడుతూ ఉ ంటుంది.నిత్యం రద్దీగా జనాలతో కిక్కిరిసి ఉండే



# ఓట్ చోరీతోనే మోడీ గద్దెనెక్కారు

**మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం**

**రాజమహేంద్రవరం, జయజయహే:**

దేశంలో ఓట్ చోరీ చేసి మోడీ సర్కారు ను ఏర్పాటు చేశారని కేంద్ర మాజీమంత్రి, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం అన్నారు. బుధవారం రాజమండ్రి లోని పేపర్ మిల్లు ప్రధాన గేటు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ సాయి కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశంలో బీజేపీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలో నకిలీ ఓటర్లు ను సృష్టించి, ఎన్నికల్లో వాటిని వారికి అనుకూలంగా మార్చుకుంటుందన్నారు. దేశంలో బీజేపీ చేస్తున్న ఓటు చోరీ ని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ అధికారాలతో సహా బహిర్గతం చేయడం జరిగిందన్నారు. దీంతో తమ దొంగతనం బట్టబయలు కావడంతో మోడీ సర్కారు కాంగ్రెస్ నాయకులు ఎదుర్కొలేక దొంగ దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఓట్ చోరీ పై రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఐదు కోట్ల సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. ఒక్క రాజమండ్రి పార్లమెంటు పరిధిలోనే లక్షా సంతకాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. రాజమండ్రి పార్లమెంటు పరిధిలోని సీనియర్, జూనియర్ నాయకులతో కలిసి అన్ని గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ జెండా ఎగిరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ, జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ సభ్యులు బోడా వెంకట్, రాజమండ్రి సిటీ ఇన్చార్జి బాలేపల్లి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# మెగా డీఎస్సీలో దగా పడ్డాం

**కాల్ లెటర్స్ వచ్చి.. ఉద్యోగం రాలేదు**

**డీఎస్సీ అభ్యర్థులు ఆందోళన**

**అమరావతి, జయజయహే**

కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ఇప్పటికే ముగిసిన సంగతి తెలిసిందే. అయితే ఈ నియామకాల్లో దొర్లిన తప్పిదాలు ఇప్పుడు అధికారులను చిక్కుల్లో పడేసే పరిస్థితి వచ్చింది. అసలేం జరిగిందంటే.. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ సెలక్షన్ లిస్టులో పేర్లు ఉండి కూడా ఉద్యోగాలు లభించని పలువురు అభ్యర్థులు తాజాగా రాష్ట్ర సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. 1:1 నిష్పత్తిలో డీఎస్సీ పోస్టులకు ఎంపికయ్యామని, మాకు అభినందనలు కూడా తెలిపారు. ఉద్యోగం ఖాయమని చెప్పారు. తీరా చూస్తే సెలక్షన్ లిస్టులో మా పేరు లేదు. అలాగని రిజెక్ట్ లిస్టులో కూడా మీ పేరు లేదు. మమ్మల్ని ఇంత మోసం ఎలా చేస్తారు? అంటూ పలువురు డీఎస్సీ అభ్యర్థులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సచివాలయం మెయిన్ గేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో మంత్రి లోకేష్‌ను కలిసేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం పంపిన కాల్ లెటర్లు ప్రదర్శిస్తూ%ా% తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. మా పేర్లు లిస్టులో ఎందుకు లేవో ఎవరూ వివరించడం లేదని అన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యాం. ధ్రుపపత్రాలు పరిశీలించారు. ఎంఈఓలు మాకు ఉద్యోగం వచ్చిందని అభినందించారు. మా పేర్లు సెలక్షన్ లిస్టులోను, రిజెక్టు లిస్టులోనూ లేవు. దీనిపై ఎవరూ స్పష్టత ఇవ్వట్లేదు. మేమంతా మధ్యతరగతి వాళ్లం. ఈ ఉద్యోగమే మా భవిష్యత్తు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మాకు ఇలా అన్యాయం జరిగింది. ప్రభుత్వం స్పందించాలంటూ బాధిత అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు.



# స్వచ్ఛ గ్రామంగా సున్నంపాడు

**స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందజేసిన అల్లూరి జిల్లా కలెక్టర్**

**మారేడుమిల్లి జయజయహే**

మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయితీకి ఉత్తమ క్లాప్ మిత్ర అవార్డు గుర్తింపు రావటంతో సర్పంచ్ ,సచివాలయ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.పాడేరు స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ , జిసిసి ఛైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ ,పాడేరు ఐటిడిఎ పీఓ శ్రీ పూజ , జనసేన ఇంచార్జి గంగులయ్య వారి చేతులమీదుగా సున్నంపాడులో పారిశుధ్య కార్మికుడుగా పనిచేస్తున్న మడకం రామన్న దొరకు స్వచ్ఛఆంధ్ర -2025 అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరించి , బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా సున్నంపాడు గ్రామాన్ని స్వచ్ఛతగా ఉంచినందుకు ఈ అవార్డును పొందుకోవటం చాల సంతోషంగా ఉందని మరింత బాధ్యతగా నా విధులు నిర్వర్తించి మా గ్రామాన్ని సస్యశ్యామలంగా తీర్చుటకు ప్రయత్నిస్తానని ఈ అవార్డు మా పంచాయితీకి అంకితమని అవార్డు గ్రహీత రామన్న దొర అన్నారు .ఈ కార్యక్రమంలో సున్నంపాడు పంచాయితీ సర్పంచ్ వెలుగురి చిన లచ్చి రెడ్డి పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో




# అమెరికా వెళ్లేందుకు జంకు

## ట్రంప్ చర్యలతో చాలామంది వెనకడుగు

## తగ్గిన విద్యార్థి వీసాలా జారీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విద్యార్థి వీసాలపై విధించిన కఠిన ఆంక్షలతో.. వీసాల తగ్గుదలలో భారతీయ విద్యార్థులే అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. బెదిరింపు విధానాలు, ఆంక్షల మధ్య అమెరికా వెళ్లేందుకు భారీతీయ విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఈయేడు అమెరికా వెళ్లాలనుకున్న వారు తగ్గారు. ఆగస్టులో అమెరికా సుమారు ఐదోవంతు తక్కువ విద్యార్థి వీసాలు జారీ చేసిందని, దీంతో భారతీయ విద్యార్థుల సంఖ్య పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేన్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అమెరికా యూనివర్శిటీల్లో విద్యాసంవత్సర ప్రారంభ నెల అయిన ఆగస్టులో 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. ఇది 2024 ఆగస్టుతో పోలిస్తే 19.1శాతం తగ్గినట్లు వెల్లడించింది. గతేడాది అమెరికాకు వెళ్లిన విద్యార్థుల్లో భారతీయ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది కన్నా 44.5శాతం తక్కువ విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. అదే సమయంలో చైనా విద్యార్థులకు 84,647 వీసాలను జారీ చేసింది. ఇది భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసా సంఖ్య కన్నా రెట్టింపు కంటే ఎక్కుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే ఈనివేదిక అమెరికాలో విధ్యనభ్యసిస్తున్న మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను ప్రతిబింబించదు. వీరిలో చాలా మది గతంలో జారీ చేసిన వీసాలపైనే నివసిస్తున్నారు. తాజా గణాంకాలు అనేక ముస్లిం దేశాల నుండి విద్యార్థి వీసాలలో గణనీయమైన తగ్గుదల నమోదైనట్లు నివేదిక తెలిపింది. ఇరాన్ నుండి ప్రవేశాలు 86శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ట్రంప్ శరణార్థులు, వీసాల జారీపై ఆంక్షలు విధించారు. జూన్‌లో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలని రాయబార కార్యాలయాలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఐటి నిపుణుల కోసం జారీ చేసే హెచ్1బి వీసాల రుసుమును కూడా ట్రంప్ భారీగా పెంచారు. ఈ క్రమంలో అమెఇరాకా అంత సులువు కాదన్న భావనలో భారతీయ విద్యార్థులు ఉన్నారు.

# పాక్ నయవంచక విధానాలు!



ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో




చెట్టాపట్టాలు వేసుకుని తిరుగు తోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బంధంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.


# రంగస్థల రాజు.. రారాజు

# డా.చాగంటి సన్యాసిరాజు

**జననం: 1898 అక్టోబర్ 9,**

**మరణం: 1961 ఫిబ్రవరి 21**

**పీసపాటినరసింహమూర్తిరంగస్థలంపై అనేక పాత్రలు పోషించి, ప్రేక్షకులను మెప్పించారు. అంజలీదేవి పలుచలనచిత్రాలలోనటించి, ప్రేక్షకులను మైమరపింపజేసింది. అలాంటిమేటినటులను రంగస్థలంకు పరిచయంచేసిన ఘనత చాగంటిసన్యాసిరాజుకు దక్కుతుంది. రంగస్థలంపై సన్యాసిరాజు చూపు తున్న హావభావాలు, వాచకరీతులు పరికించిన, పరిశీలించిన చలన చిత్ర రంగ ప్రముఖులు సినిమాల్లోకి రమ్మని ఆహ్వానించారు. నన్యాసిరాజు సున్నితంగా తిరస్కరించారు. ఆయన వృత్తివైద్యం. ప్రవృత్తినటన. చలన చిత్ర రంగంలోకాలుమోపితే, ప్రజలకు వైద్యంఅందించలేననే భయంవారిది. అందుకే చివరిశ్వాస వదిలే వరకు వైద్యునిగా కొనసాగుతూ, రంగస్థలాన్నిఅంటిపెట్టు కొని వున్నారు.**



చాగంటిసన్యాసిరాజు 1898 అక్టోబరు 9న జన్మించారు. విశాఖపట్నంజిల్లా లోని అనకాపల్లివారి జన్మస్థలం. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలు అనకాపల్లిలోపూర్తిచేసి, వైద్యవిద్యవిశాఖపట్నంలోని వైద్యకళాశాలలోపూర్తిచేసి వైద్యపట్టాఅందుకొన్నారు. విద్యార్థిదశలోనే నటనపై మక్కువ ఏర్పడింది. నన్యాసిరాజుకు పాఠశాల, కళాశాలల్లోచదివేరోజుల్లోనే చిన్నచిన్న వేషాలు ధరించి ప్రముఖుల ప్రశంసలతోపాటు, బహుమతులు కూడా అందుకున్నారు. నటనతో పాటు రచనా వ్యాసంగంపట్లకూడా ఆసక్తిపెంచుకున్నారు. చంద్ర గుప్తుడు, అశోకుడు, రుద్రమదేవి, కర్ణవిజయంలాంటినాటికలు రచించి, వాటిలోనాయకపాత్రలు పోషించి మెప్పించేవారు. సహపాత్రలను తానే ఎంపిక చేయడంతో పాటు, శిక్షణ యిచ్చి, దర్శకత్వంకూడా వహించేవారు. సన్యాసిరాజు ఆజానుబాహుడు. స్ఫురద్రూపి. చురుకైన చూపులతో రంగస్థలిపై నడయాడుతూ, ధరించిన పాత్రలోపరకాయ ప్రవేశంచేసి, ప్రేక్షకులను మెప్పించేవారు, మైమరపించేవారు. అత్యున్నతి కీర్తిసంతరించుకొన్న తెలుగు నాటక రంగంనానాటికీ తీసికట్టు గా తయారవుతుందనే తపన ఆయనలోనిండివుండేది. 'తెలుగు నాటక రంగంఔన్నత్యంకాపాడలనేది ఆయన ఆశ, ఆకాంక్ష. తెలుగు నాటకానికి కొత్తరూపంఅందించి, కొత్తధ్యేయంసమకూర్చి పెట్టాలనేతపన, తాపత్రయంఆయనది. వైద్యపట్టాఅందుకొన్న అనంతరం, సామర్లకోటలోవైద్యవృత్తిప్రారంభించారు. బడుగు - బలహీన వర్గాలను అందుబాటులోవుంటూ వైద్యసేవ కొనసాగిస్తున్న తరుణంలో, 1937లోకొందరు మిత్రులతో కలసి, "వాణి నాట్యమండలి"అనే నాటక సమాజాన్నిస్థాపించారు. పగలు వైద్యం, రాత్రి నటన కొనసాగించటానికి సంసిద్ధమయ్యారు.

నాటకంఏదైనా కావచ్చు, ప్రదర్శన ప్రదేశంఎక్కడైనా కావచ్చు. 'వాణి నాట్యమండలి' ప్రదర్శనకు ప్రేక్షకులు అసంఖ్యాకంగా హాజరయ్యేవారు. 1942లో" మద్రాసుఆంధ్ర మహాసభ' వారు నాటకపోటీలు నిర్వహించారు. ఆ పోటీలోవాణినాట్యమండలి వారు 'పల్నాటివీర చరిత్ర' నాటకంప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా ఎన్నికైంది. దానిలోనాయకపాత్ర పోషించిన సన్యాసిరాజు ఉత్తమ నటునిగా బహుమతి అందుకొన్నాడు. అంజలీదేవికి ఆ నాటకంద్వారా తెలుగు నాటకానికి పరిచయంచేయటం, ఆమె మగువ మాంచాల పాత్ర ధరించటం, మంచి గుర్తింపు పొందటంకూడా జరిగాయి. నాటకరంగంలోవిశేష పాఠవాలు కనబరచిన పీసపాటినరసింహ మూర్తికూడా అదే నాటకంలో'కన్నమదాసు'గా నటించి ప్రేక్షకులను అలరించారు. ఈ నాటక ప్రదర్శనను తిలకించిన శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి సన్యాసిరాజుకు 'నటరాజు' బిరుదు ప్రదానంచేశారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ "వేనరాజు" నాటకంరచించించారు. చాలా మంది దాన్నిప్రదర్శించటానికి ప్రయత్నించారు గాని మెప్పించ లేకపోయారు. ముఖ్యంగా రచయిత విశ్వనాథ వారిని అసలు మెప్పించ లేకపోయారు. ఒకానొక సందర్భంలోసామర్లకోటలో, విశ్వనాథ వారి సమక్షంలోసన్యాసిరాజు 'వేనరాజు' నాటకాన్నిప్రదర్శించారు. ప్రేక్షకుల జేజేనాథాలతో హాలు దద్దరిల్లిపోయింది. విశ్వనాథ సైతంఆ ప్రదర్శనను తిలకిచి ముగ్దులై సన్యాసిరాజును 'నటరాజు' బిరుదుతో సత్కరించారు. సన్యాసిరాజును కీర్తి, ప్రతిష్ఠల అందించిన నాటకాల్లోబ్రహ్మనాయుడు, కాళ్ళకూరి నారాయణ రావు గారి మధుసేవ, ఖిల్జీరాజ్యపతనంలాంటివి కొన్నిమాత్రమే. 1958లోఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, సాహిత్యనాటక అకాడమీలు ఏర్పడ్డాయి. వాటిలోడా॥ సన్యాసిరాజు శాశ్వత సభ్యునిగా నియమితులు కావటంవిశేషంనాటక రంగంపై తనదైన ముద్ర వేసిన డా॥ సన్యాసిరాజు 1961 ఫిబ్రవరి 21న కన్నుమూశారు.

**దాసరి ఆళ్వారస్వామి**
**చరవాణి:9393818199**
**అనుభవ పాత్రికేయులు, కుందేరు - 521245**
**కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్**

## కాలిఫోర్నియాలో

# దీపావళి సెలవు

## ప్రకటన చేసిన గవర్నర్



భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. 'కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతుంది' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూయార్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తింపును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ నిర్ణయంతో ఇక్కడి ఎన్నారైలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెదగంట్యాడలో పబ్లిక్ హియరింగ్ రసాభాస

## కుర్చీలు విసిరేసి మహిళల ఆందోళన

## ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేసిన అధికారులు

ప్రత్యేకప్రతినిధి, జయజయహే





విశాఖపట్టణం లోని పెదగంట్యాడ గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు గత కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న పలు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ప్రభుత్వం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మొదటి నుంచి సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్న అన్ని గ్రామాల ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు అక్కడకు చేరుకున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెదగంట్యాడలో పబ్లిక్ హియరింగ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ కు స్థానిక ప్రజలు హాజరయ్యారు. సిమెంట్ ఫ్యాక్టరీతో స్థానికంగా ఉండే తమకు ఇబ్బంది కలుగుతుందంటూ ఆందోళనకు దిగారు. గో బ్యాక్ అంటూ సిమెంట్ కంపెనీ ప్రతినిధులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల ఆందోళనతో పబ్లిక్ హెయరింగ్ సభా ప్రాంగణం దద్దరిల్లింది. సభా ప్రాంగణం వద్దకు పెద్దెత్తున ఆందోళనకారులు చేరుకొని కుర్చీలను విసిరికొట్టారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలంటూ పెద్దెత్తున స్థానికులు నిరసనకు దిగారు. ప్రజాభిప్రాయ సేకరణ సభా ప్రాంగణం వద్ద స్థానికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కుర్చీలు, బారికేడ్లు ధ్వంసం చేశారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిర్వాసితులు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే, స్థానికులు మాత్రం మా ప్రాంతానికి వచ్చి మామీదే కేసులు పెడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో ఎక్కడా లేని స్మార్ట్ ఫీచర్ పార్క్





## ఎస్ బి ఐ కాలనీ పార్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు... ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం, జయజయహే

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్థానిక ఎస్ బి ఐ కాలనీలో స్మార్ట్ ఫీచర్ పార్క్ ఏర్పాటుచేశామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. క్రికెట్ బాక్స్ తో కూడిన ఈ పార్క్ లో వెలుగులు యాప్ ఆధారితంగా ఏర్పాటుచేశామని తెలిపారు. బుధవారం ఉదయం ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కల్సి స్మార్ట్ ఫీచర్ పార్క్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ స్థానికులు దీని నిర్వహణ చూసుకోడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడో ఒక పార్క్ అభివృద్ధి చేసి, దాన్ని చూడ్డానికి అక్కడకు రండి అని జనాలకు చెప్పేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక జనం ఉన్నచోటకే అభివృద్ధి తీసుకెళ్తున్నామని చాల గర్వంగా చెబుతున్నా మని ఎమ్మెల్యే వాసు అన్నారు. అన్ని ప్రాంతాల వారికి ఆహ్లాదం కల్గిస్తున్నామన్నారు. చెప్పినట్టే చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శమన్నారు.

వైసిపి వాళ్ళలా కంబాల చెర్వు పార్క్ ఒకటే అభివృద్ధి చేసి, అలా చేసాం ఇలా చేసాం అని చెప్పకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక ఫేజ్ వన్ లో ఏడు పార్కులు అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. రాజమండ్రిలో బాక్స్ క్రికెట్ లో నెంబర్ వన్ ఆ పార్కులో ఉందన్నారు. ఇదేదో ప్రయివేటు సైట్స్ లో ప్రయివేటు ఏజన్సీ నడిపేది కాదన్నారు. కార్పొరేషన్ వాళ్ళు అభివృద్ధి చేసిన పార్క్ లో బాక్స్ క్రికెట్ ఉందన్న విషయం అందరూ గమనించాలన్నారు. అలాగే షటిల్ కోర్టు, చిల్డ్రన్స్ ప్లే , అవుట్ డోర్ జిమ్ , చుట్టూ లైటింగ్, వాకింగ్ ట్రాక్ అండ్ గ్రీనరీ, ఆటోమేటిక్ యాప్ కంట్రోల్ లైటింగ్ వంటివన్నీ ఈ పార్కులో ఉన్నాయని ఎమ్మెల్యే వాసు వివరించారు. గతంలో వైసిపి వాళ్ళు చీకట్లో ఉంచారని, ఇప్పుడు కూటమి వెలుగులు నింపిందని ఆయన ఎద్దేవా చేసారు. యాప్ ద్వారా లైటింగ్ ఆపడం, వెలిగించడం చేసి చూపించారు.

క్రికెట్ ప్లేయర్ విరాట్ కోహ్లీ స్టాట్యూ మాదిరిగా ఒక బొమ్మ తయారుచేసి కూర్చున్నట్లు ఉందని, ఇది కూడా సెల్ఫీ పాయింట్ అవుతుందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అన్ని పార్కులు అభివృద్ధి చేస్తామని, అతి దగ్గరలో థీమ్ బేస్డ్ పార్కులు రెండు ప్రారంభించుకో బోతున్నామని ఆయన అన్నారు. నిర్వహణ కూడా స్థానిక ప్రజలు బాధ్యతగా తీసుకుంటే ఇంకా బాగుంటుందని అన్నారు. ఇన్ని కార్యక్రమాలు చేసున్నా సరే, గత వైసిపి వాళ్ళ మాదిరిగా లైట్స్ కింద ఫోటో, బటన్ నొక్కినట్లు ఒక ఫోటో పెట్టుకోవడం లేదని అన్నారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సింపుల్ గ ప్రారంభించామని ఆయన తెలిపారు.

**అభినందనీయం : సోము వీర్రాజు**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత స్కీమ్ లో నగరాల సుందరీకరణ చేయాలన్నది లక్ష్యమన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే వాసు 30పార్కులను డిజైన్ చేసి అభివృద్ధి చేసి, అన్ని ప్రాంతాల వారికి ఆహ్లాదకర వాతావరణం అందించాలని భావించడం అభినందనీయమని అన్నారు. పార్కులు అభివృద్ధి చేయడమే కాకుండా స్థానిక పెద్దల సహకారంతో నిర్వహణ చేపట్టడం ఆనందించదగ్గ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వమే వైద్య కళాశాలలను కొనసాగించాలని కోరుతూ ఈనెల 19న సదస్సు

## డా. ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు, (జయజయహే):




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 590 జీవో ద్వారా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విజయవాడలోని ఎమ్.బి భవన్ ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాఁఎ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, వై.ఎస్.ఆర్.సి.పి విద్యార్థి విభాగ గుంటూరు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. వినోద్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. డాఁఎ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే పేదల అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. సేవారంగంలో కొనసాగాల్సిన విద్య, వైద్యాన్ని ప్రైవేటు రంగానికి తరలించడం భావ్యం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పి పి పి విధానాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థి యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులందరినీ అక్టోబర్ 19న జరిగే రాష్ట్ర సదస్సుకు ఆహ్వానించి ఉద్యమ కార్యాచరణతో భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు కె. ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదింటిని పూర్తిచేసి ప్రవేశాలు కల్పించిందని, మరో రెండు కళాశాలలు నిర్మాణం పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్న తరుణంలో నేటి కూటమి ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పరోక్షంగా ప్రైవేటు పరం చేయాలని భావించడం దుర్మార్గమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడాన్ని సిద్ధంగా ఉన్న ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్యను అందించే 10 ప్రభుత్వ వైద్య కళాశాలల పై 5 వేల కోట్లు ఖర్చు చేయలేని దీనస్థితిలో ఉందా అని ప్రశ్నించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలపై పెట్టే పెట్టుబడులను వ్యయంగా భావించరాదని, దేశాభివృద్ధికి ఉన్నతమైన మానవ వనరుల అభివృద్ధిగా భావించాలన్నారు. పి పి పి ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలు ఉద్యమిస్తున్నాయని, వాటిన్న%శీ%టిని ఏకత్రాటి పైకి తీసుకొొచ్చి ఐక్య ఉద్యమ నిర్మాణం కోసం రాష్ట్ర సదస్సును అక్టోబర్ 19న విజయవాడలో ఎం.బి. భవన్ లో నిర్వహిస్తున్నామని తెలుపుతూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు

# ఏపీఎంఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పోతురాజు సత్య నియామకం

రాజమహేంద్రవరం, జయజయహే



ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఫ్) రాష్ట్ర కార్యదర్శిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల టీవీ 9 స్పెషల్ కరస్పాండెంట్ పోతురాజు సత్య నియమితులు అయ్యారు. ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిల్లీబాబు రెడ్డి రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో సత్య ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి, అభివృద్ధికి ఏపీఎంఎఫ్ తరఫున తన వంతు కృషి చేస్తానని అన్నారు. అక్రిడేషన్ విషయంలో త్వరలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోకపోతే ఏపీ మీడియా ఫెడరేషన్ తరపున సంఘ సభ్యులు, పెద్దలతో కలిసి న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సత్యకు పలువురు జర్నలిస్టులు, రాజకీయ ప్రముఖులు, నగర ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బి ఎన్ రోడ్డు గురించి పట్టించుకోండి

## ముఖ్యమంత్రికి విన్నవించిన జనసేన రాజు

చోడవరం, జయజయహే



చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు , చోడవర%శీ% నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న బీమ్మునిపట్నం%-%నర్సీపట్నం స్టేట్ హైవే (బి ఎన్ రోడ్) అత్యంత తీవ్ర సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బుధవారం లిఖిత పూర్వకంగా సీఎం కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కలుపుతున్న బి ఎన్ రోడ్, మడుగుల పాడేరు ఏజెన్సీకి కూడా చేరుకునే అత్యంత కీలక రహదారన్నారు. 2018 వరకు ఈ రహదారి పరిస్థితి బాగానే ఉండేదనీ, కానీ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో సంరక్షణ లేకపోవడంతో రహదారి పూర్తిగా ధ్వంసం అయింది అన్నారు. అలాగే వడ్డాది విజయరామరాజు పేట వద్ద రెండు ప్రధాన వంతెనలు కూలిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ని పేర్కొంటూ “వైఎస్సార్సీపీ ప్రభుత్వం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్ డి బి ) ఆర్థిక సహకారంతో ఈ రహదారి నిర్మాణానికి టెండర్లు కూడా ఫైనలైజ్ చేసిందన్నారు.కానీ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనిని ప్రారంభించలేదన్నారు. 2024 ఎన్నికల సమయంలో మన కూటమి ప్రజలకు ఈ రహదారి వంతెనలను పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చాం. అయితే 16 నెలలు గడిచినా రోడ్లు భవనాల శాఖ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు” అని అన్నారు.ఇటీవలి కాలంలో వర్షాల కారణంగా విజయరామరాజు పేట వద్ద కాజ్‌వే కొట్టుకు పోయి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై ప్రతిరోజూ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా లో వార్తలు ప్రధానంగా వస్తున్నాయి. రైతులు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు అందరూ ఈ రహదారి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని రహదారి వంతెనల పునర్నిర్మాణం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం కాపీని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కూడా పంపినట్లు ఆయన పేర్కొన్నారు.



# విద్యుత్ స్తంభం వెంటనే తొలగించాలి

## గ్రామస్తులు డిమాండ్

అరకులోయ, జయజయహే



అల్లూరి జిల్లా అరకువేలి మండలం మాడగడ పంచాయతీ కుసుమగూడ గ్రామంలో విద్యుత్ స్తంభం పుచ్చిపోయి ప్రమాదానికి పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గాలి వర్షాలకు ఎప్పుడెప్పుడు పడిపోతాదని గ్రామస్తులు భయభ్రాంతులవుతున్నారు. ఈ కరెంటు స్తంభాం వెంటనే తొలగించి .వేరే కరెంట్ స్తంభం నియమించాలని కోరారు. అనేకమార్లు స్థానిక లైన్మెన్ కు స్తంభం మార్పిడి చేయాలని చెప్పిన స్పందించలేదని అన్నారు. విద్యుత్ శాఖ వారు మా గ్రామానికి వచ్చి పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు అన్నారు.

# శారదానికేతనము అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవం




**గుంటూరు, జయజయహే**

1922 లో బాలికల విద్య కోసం స్థాపించిన శారదానికేతనము అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 11వ తేదీన గుంటూరులోని 2/14 బ్రాడీపేటలో నిర్వహిస్తున్నట్లు శారదానికేతనము సెక్రటరీ టి. శ్రీనివాస్, పూర్వ సెక్రటరీ జి. శ్రీనివాసరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, లయన్స్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాష్, ప్రిన్సిపాల్ బి. కోటి రత్నం, హెడ్మాస్టర్ ఎన్. ఉషా కుమారి లు తెలిపారు. ఈనెల 8వ తేదీన గుంటూరులోని శారదానికేతనము విద్యా సంస్థల ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో శారదానికేతనము సెక్రటరీ టి. శ్రీనివాస్ ప్రసంగిస్తూ శారదానికేతనము అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా౹౹ పెమ్మసాని చంద్రశేఖర్, లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్ తో పాటు మాజీ శాసనమండలి సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు డా౹౹ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, పోలిశెట్టి శ్రీహరి ప్రసాద్ రావు, జాగర్లమూడి మురళీమోహన్, గ్రంధి కాంతారావులు పాల్గొంటారని తెలిపారు. గత 100 సంవత్సరాలుగా శారదానికేతనము అభివృద్ధికి తోడ్పడిన దాతలందర్నీ ఆహ్వానిస్తున్నామని, గుంటూరు నగర ప్రముఖులకు ఆహ్వానాలు అందించామని వివరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1920వ దశాబ్దంలో మహిళా అక్షరాస్యత ఒక్క శాతం మాత్రమే ఉన్న సందర్భంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ దంపతులు బాలికలకు ఉచితంగా విద్యను అందించడానికి భోజన, వసతితో కూడిన శారదానికేతనమును స్థాపించినారని తెలిపారు. 1925లో మునగాల జమీందారు శ్రీ రాజా నాయని వెంకట రంగారావు, బహుద్దూర్ 1.90 ఎకరాల భూమిని వారి మనవడు సుదర్శన రెడ్డి స్మారక చిహ్నంగా దానం చేశారని తెలిపారు. కొండా వెంకటప్పయ్య గారు, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, నాట్కో సంస్థ, వసుధ ఫౌండేషన్, తమ్మారెడ్డి భరద్వాజ, పోలిశెట్టి శ్రీహరి ప్రసాద్ రావు, డా౹౹ బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి, సినీ నటులు త్రిపురనేని సాయిచంద్ లాంటి దాతల సహకారంతో శారదానికేతనం అభివృద్ధి చెంది నేడు 550 మంది విద్యార్థినులతో వికసిస్తుందన్నారు. వందలాదిమంది తెలుగు, సంస్కృత అధ్యాపకులుగా ఉద్యోగాలు పొందినారన్నారు. 1930వ దశాబ్దంలో మహాత్మా గాంధీజీ శారదానికేతనము సందర్శించినారని పేర్కొన్నారు. లయన్స్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాష్ మాట్లాడుతూ కాంద్రు సింగారావు మెమోరియల్ కమిటీ నూతన తరగతుల నిర్మాణానికి ముందుకు వచ్చిందని తెలిపారు. శారదానికేతనము విద్యాసంస్థల అభివృద్ధికి లయన్ చిగురుపాటి వరప్రసాద్ సేవా యజ్ఞం స్ఫూర్తితో సహకరిస్తామని తెలిపారు.

# రూ.1.40 కోట్లతో శ్రీనివాసపురం రోడ్డు నిర్మాణం

**- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్,మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన లక్ష్మి.**

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**



అభివృద్ధి పథం లో దూసుకు పోతున్న స్థానిక మున్సిపాలిటీలో ప్రజావసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త రోడ్ల నిర్మాణం కార్య క్రమాలు చేపట్టటం హర్ష ణీయం అని స్థానిక శాసన సభ్యుడు సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడి శ్రీనివాసపురం రోడ్డు బైపాస్ వరకు రూ 1.40 కోట్ల అంచనా తో నిర్మాణం జరుపుతున్న నేపథ్యంలో బి టి రోడ్డు పనికి ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్పర్సన్ బత్తిన లక్ష్మి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గం లో రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధా న్యత అన్నారు. రానున్న రోజుల్లో జంగారెడ్డిగూడెం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని మాస్టర్ ప్లాన్ ప్రకారం టౌన్ లో అన్ని రోడ్లు ఇతర కార్యక్రమాలు చేపట్టాలన్నారు ప్రజాభిష్టాన్ని బట్టి ముందు కు వెళ్ళాలని సూచించారు. మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ తమ హయాంలో పట్టణం లోని అన్ని ప్రధాన రహదార్లను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతం లో బుట్టాయి గూడెం రోడ్డు, సాలి పేట రోడ్డు, కొత్త బస్టాండ్ నుంచి సూర్య కాలేజీ రోడ్డు వేసాం అని పేర్కొన్నారు. అలాగే సుబ్బమ్మ పేట మీదుగా బై పాస్ వరకు ప్రతిపాధిత రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాగా ఈ రోడ్డు తో పాటు దాని ప్రారంభోత్సవం జరుగుతుందని స్థానిక కౌన్సిలర్ సిహెచ్ అచ్యుతరామయ్య తెలిపారు. కార్యక్రమం లోజె డ్ పి టి సి పోల్నా టి బాబ్జి, నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, పట్టణతెదేపా అధ్యక్షులు కొండ్రె డ్డి కిషోర్, మున్సిపల్ కమీషనర్ కెవి రమణ కూటమి నాయకులు పలువురు కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## ఎలా అడ్డుకుంటారో చూస్తామంటే

# మక్కెలు విరగ్గొట్టి మూలన కూర్చోబెడతాం

**జగన్ టూర్‌పై గంటా మాస్ వార్నింగ్**

**విశాఖపట్నం, జయజయహే**





శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా 63 కిలో మీటర్ల పొడవున రోడ్డు మార్గాన టూర్ చేస్తాం, ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటే ప్రభుత్వం ఊరుకోదని.. మక్కెలు విరగ్గొట్టి లోపల కూర్చోపెడతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైసీపీకి వార్నింగ్ ఇచ్చారు. ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కాదని, వ్యవస్థలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు. దర్శి, సత్తెనపల్లి, నెల్లూరు, అనంతపురంలలో జగన్ పర్యటనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. భద్రతా కారణాలరీత్యా నర్సీపట్నం పర్యటనకు హెలికాప్టర్ లో వెళ్లాలని పోలీస్ యంత్రాంగం సూచిస్తే దాన్ని రాజకీయం చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరపురం జిల్లా రాప్తాడు పర్యటనకు హెలికాప్టర్ లోనే వెళ్లిన జగన్ ఇప్పుడు ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. తమిళ్ హీరో విజయ్ పర్యటనలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 40 మంది మృతి చెందారని.. మరోపక్క అంతర్జాతీయ మహిళ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గురువారం ఉదయం విశాఖ వచ్చి సాయంత్రం 4.30 గంటలకు బెంగుళూరు ప్యాలెస్ కు వెళ్లిపోయే వీకెండ్ పొలిటీషియన్ గా జగన్ ను అభివర్ణించారు. వైసీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటికి తాళాలు వేసినట్టు.. చంద్రబాబు పరామర్శకు వెళు తున్న పవన్ కల్యాణ్ ను అడ్డుకున్నట్టు.. తామూ చేయగలమని, అయితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించే రాజకీయ పార్టీ కావడం వల్ల ఎవరి హక్కులు హరించే ఉద్దేశం తమకు లేదన్నారు.

**కోటి సంతకాలు దేని కోసమో చెప్పాలి!**

అధికారంలో ఉన్న అయిదేళ్లలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పూర్తి చేయని జగన్మోహన్ రెడ్డి.. వాటిని పూర్తి చేయాలని ఇప్పుడు కోటి సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా ఉందని గంటా అన్నారు. 26 జిల్లాల్లో కోట్లాది రూపాయలతో వైసీపీ పార్టీ కార్యాలయాలు కట్టుకున్న జగన్ తాను పూర్తి చేయలేని నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శనకు వెళ్లడం విడ్డూరంగా ఉందని తెలిపారు. మెడికల్ కాలేజీల విషయంలో ఏమాత్రం నిబద్ధత ఉన్నా.. రూ. 450 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టకుండా నర్సీపట్నం మెడికల్ కాలేజీ పూర్తి చేసి ఉండేవారని వ్యాఖ్యానించారు. వైసీపీ హయంలో నాణ్యమైన మద్యం అందించామని జగన్ చెప్పడం జోక్ ఆఫ్ ద ఇయర్ గా ఎద్దేవా చేశారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ రాకూడదనే ఉద్దేశంతో చనిపోయిన రైతు పేరుతో కోర్టులో కేసు వేసి.. వైసీపీ నాయకులు ఆత్మరక్షణలో పడ్డారని చెప్పారు. అధికారంలో ఉండగా స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకులకు అపాయింట్మెంట్ ఇవ్వని జగన్మోహన్ రెడ్డి ఏం ముఖం పెట్టుకుని స్టీల్ ప్లాంట్ కు వెళ్తారన్నారు. అభివృద్ధి, విజన్ లకు చంద్రబాబు.. అరాచకానికి, అవినీతికి జగన్మోహన్ రెడ్డి.. బ్రాండ్ అంబాసిడర్లుగా పేర్కొన్నారు.

**విశాఖ అభివృద్ధి అడ్డుకునేలా వైసీపీ తీర్మానం**

విశాఖ అభివృద్ధిని ఆపడానికి ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఇటీవల పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాల్లో రహస్యంగా సమావేశం కావడం సిగ్గు చేటన్నారు. గూగుల్, బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ, అర్సెల్లాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి పరిశ్రమల భూ సేకరణ అడ్డుకోవాలని ఆ సమావేశంలో తీర్మానించారని ఆరోపించారు. వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలను అడ్డుకుని ఏం సాధిస్తారని, ఉత్తరాంధ్రపై చూపించే ప్రేమ ఇదేనా అని నిలదీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, చిక్కాల విజయ్ బాబు, గాడు అప్పలనాయుడు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# దశాబ్దాల కళ నెరవేరేనా?

**-గరుగుబిల్లిలో వంతెన నిర్మాణంకై పరిశీలన.**

**-గత పాలకుల వల్ల నిరాధారనకు గురైన గ్రామాలు**

**-కూటమి ప్రభుత్వంతో సమగ్ర అభివృద్ధి సాధ్యం**

**-పెరుమాల నిర్మల,టీడీపీ క్లస్టర్ ఇంచార్జి**

**అనంతగిరి, జయజయహే:**

అనంతగిరి మండలంలోని గరుగుబిల్లి ప్రధాన రహదారిపై హై లెవల్ బిడ్జి నిర్మాణం కొరకు బుధవారం ఇంజనీర్ అధికారులతో పరిశీలించినట్టు టీడీపీ అనంతగిరి మండల క్లస్టర్ ఇంచార్జి పెరుమాల నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మండలంలో మారుమూల గరుగుబిల్లి, రొంపల్లి పంచాయతీ గ్రామాల కు వెళ్లాలంటే ఇక్కడ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు, సరైన రహదారి మధ్య మధ్యలో వాగులు దాటు కుంటూ ప్రాణాలను అర చేతిలో పట్టుకుని వెళల్సిన దుస్థితి నెలకొందన్నారు, వర్షా కాలంలో అయితే వాగులపై బిడ్జిలు లెకపొవడంతో అనేకమంది వాగులు దాటే ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నరని తెలిపారు. అలాగే గరుగుబిల్లిలో వంతెన నిర్మాణం చేపట్టినట్లు అయితే అనేక గ్రామాలకు మేలు కలుగుతుందాన్నారు. గత వైస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంతో పాటు మండల,గ్రామ స్థాయిలో స్థానికులైన వైస్సార్సీపీ నాయకులను ఇక్కడ గిరిజనులు గెలిపించిన గడచిన ఇదేళ్లలో ఈ ప్రాంత ప్రజలకు ఏమి చేయలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలలకే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారన్నారు,అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అల్లూరి జిల్లా కేంద్రంలో పలుమార్లు పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టరన్నారు,అందులో భాగంగా మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు, ప్రస్తుత జిసిసి చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్ చొరవతో గత నెలలో గరుగుబిల్లి పంచాయతీ రాళ్ల గెడ్డ వంతెనకు ఇంజనీర్ అధికారులు సుమారు రూ. 1కోటి50లక్షలతో అంచనాలు వేసి పై స్థాయి అధికారులకు పంపించడం జరిగిందన్నారు. మరి కొద్దీరోజులకే గరుగుబిల్లి ప్రధాన రహదారిపై బిడ్జి నిర్మాణ పరిశీలిన కోసం ఇంజనీర్ అధికారులు రావడం ఈ ప్రాంత వాసులకు ఎంతో శు భపరిణామం అని కొనియాడారు, ఈ సందర్భంగా ఆమె ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు,ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కిడారి శ్రవణ్ కుమార్ కు ఈ ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మండపర్తి తిరుపతి రావు, పడిశెట్టి నక్షత్రమ్మ,పెదపల్లి గన్నరావు,టీడీపి సీనియర్ నాయకులు పడిశెట్టి సునీత, బూత్ ఇంచార్జిలు శెట్టి అశోక్,పెరుమాల జై రాజు, యువత,తదితరులు పాల్గొన్నారు.




## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై

# దాడి యత్నం అమానుషం

**'ఇఫ్టూ "ఆధ్వర్యంలో నిరసన సభ**

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి కి ప్రయత్నం చేసిన వ్యక్తి ని కఠినంగా శిక్షించాలని ఐ ఎఫ్ టి యు (ఇఫ్టూ )రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి రమణ డిమాండ్ చేశారు. సుమోటివ్ కేసు నమోదు చేసి ఏ న్యాయ వాది పై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ఖండిస్తూ బోసు బొమ్మ సెంటర్లో బుధవారం నిరసన సభ జరిగింది. కార్యక్రమం లో రమణ మాట్లాడుతూ ఈనెల ఆరోతేదీన ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్ న్యాయమూర్తి స్థానంలో కూర్చుని కేసులు విచారిస్తున్న సమయంలో ఒక న్యాయవాది కుల అహంకారంతో మతోన్మాదంగా ఆయన పై కాలి బూటు విసిరి దాడి చేయడానికి ప్రయత్నించాడని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యం మీద భారత రాజ్యాంగం మీద దేశ న్యాయ వ్యవస్థ మీద దాడి చేయడమేనని రమణ అన్నారు. గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారం చలాయిస్తున్న బిజెపి తన అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం కులాల పేరు మీద మతాల పేర దాడులు చేయడానికి ప్రోత్సహిస్తున్నదని రమణ విమర్శించారు.ఒక పీడిత వర్గానికి చెందిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేశారంటే ఇది భారతదేశం మీద దాడి చేసినట్లేనని విమర్శించారు.దోషి ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు, పట్టణ కార్యదర్శి మల్లేటి శ్రీను, సూది పాము జయరాజు,మార్లపూడి సుబ్బారావు వసంతాటి సత్య పత్తిపాటి వెంకన్న పెనుమాక వెంకటేశ్వర మర్రి శ్రీను కొత్తూరు అబ్బులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ సేవలకు మంత్రి ప్రశంసలు







## క్యాన్సర్ నివారణపై రోటరీ క్లబ్ చేస్తున్న గొప్ప కార్యక్రమం

### మంత్రి సత్య కుమార్ యాదవ్

**విశాఖపట్నం, జయజయహే**

రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్‌సిటీ సభ్యులు క్యాన్సర్ వ్యాధి నుండి యువతులను రక్షించే లక్ష్యంతో గర్భాశయ క్యాన్సర్ టీకా ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విశాఖపట్నంలోని ద్వారకా నగర్‌లోని శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మరియు నగర పౌర సమాజం నుండి భాగస్వామ్యం మరియు మద్దతు లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విచ్చేశారు, మహిళల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో మరియు గర్భాశయ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించడంలో రోటరీ క్లబ్ చేస్తున్న గొప్ప కార్యక్రమాన్ని మంత్రి ప్రశంసించారు. విశాఖ నగర శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ , మరియు వెలగపూడి రామకృష్ణ బాబులి ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ ప్రజారోగ్య కార్యక్రమాన్ని రూపొందించిన రోటరీ బృందానికి ఈ కార్యక్రమానికి ప్రోత్సాహించిన వారికి మరియు ఆరోగ్య సంరక్షణ నిపుణుల సమిష్టి కృషిని వారు ప్రశంసించారు.

సమాజ సేవ పట్ల నిబద్ధత మరియు భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడటానికి చురుకైన చర్యలు తీసుకున్నందుకు రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు.

సకాలంలో టీకాలు వేయడం యొక్క ప్రాముఖ్యతను విశదీకరించారు. మరియు ప్రతి ఒక్క మహిళ ఈ ప్రాణాలను రక్షించే టీకా యొక్క ప్రయోజనాన్ని పొందేలా అవగాహన కల్పించాలని ఇందులో నున్న భాగస్వామ్య సంస్థల క్రుషి శ్లాఘనీయం మని ప్రసంసించారు. టీకా కార్యక్రమానికి ముఖ్య దాత గా ఉన్న మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ, ఈ కాన్సర్ నివారణ టీకా యొక్క ప్రాముఖ్యత మరియు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అమూల్యమైన మద్దతు మరియు సహకారం అందించినందుకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి. శివాజీ మరియు కార్యదర్శి భార్గవ్ మహర్షి ముఖ్య అతిథి గా విచ్చేసిన మంత్రి కు , ప్రత్యేక అతిథులు గా విచ్చేసిన శాసన సభ్యులకు , వాక్సిన్ దాతలకు , పాఠశాల యాజమాన్యానికి మరియు వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యం మరియు శ్రేయస్సును ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీ క్లబ్ సభ్యులు ప్రతిజ్ఞ చేసారు.

# ఏఎంసీ కాలనీ కుటుంబాలకు ఉచిత దోమతెరలు పంపిణీ





అనకాపల్లి జయజయహే : స్థానిక 83వ డివిజన్ పరిధిలోగల ఏఎంసీ కాలనీ ప్రజలకు మలేరియా డెంగు చికెన్ గునియా జ్వరాల వ్యాధుల బారిన పడకుండా ఉండాలని తలచి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ వారి సూచన మేరకు అనకాపల్లి జోనల్ కమిషనర్ కె చక్రవర్తి గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర 83వ డివిజన్ ఏఎంసి కాలనీ ప్రజలకు దోమలు తెరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈ వర్షాకాలంలో వడకట్టి కాచి చల్లార్చిన వాటర్ తాగాలని వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, రోడ్డుపై తీసుకునే ఆహార పదార్థాలు నాణ్యత శుభ్రత చూసి పరిశీలించి తీసుకోవాలని ఆయన సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో బి ప్రసాద్, మంగ ఈశ్వర్ ,పి త్రినాథ్ %ఖూఎజ% హాస్పిటల్ డాక్టర్ ప్రియాంక ఏఎంసి కాలనీ నాయకులు పిట్ల రాజు టిడిపి మీడియా కోఆర్డినేటర్ ఎస్ భానుచందర్ మలేరియా డిపార్ట్మెంట్ కోదండరాం జీవీఎంసీ శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ మాడుగుల అప్పారావు ఏఎంసీ కాలనీ మహిళా నాయకురాలు బొమ్మల దేవి, పి గోపి జీవీఎంసీ సిబ్బంది సచివాల సిబ్బంది ఆర్ కృష్ణవేణి ఆశ వర్కర్ సంతోసి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లి కష్టాలు..!



## దేవరాపల్లి- కొత్తవలస రోడ్డులో కుంగిన వంతెన

## మూడు నెలలుగా తిరగని ఆర్టీసీ బస్సులు

## అవస్థలు పడుతున్న రెండు జిల్లాల ప్రయాణికులు

## వంతెన పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలని ఆందోళన

**దేవరాపల్లి, జయజయహే**

గత మూడు నెలలుగా దేవరాపల్లి - కొత్తవలస రోడ్లో రెండు జిల్లాలకు చెందిన ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతం. ఎన్నాళ్ళని ఈ కష్టాలు అంటూ ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలల క్రితం కృష్ణా రాయుడుపేట జంక్షన్ వద్ద వంతెన భారీ వర్షాలు కారణంగా కుంగిపోయింది. అప్పటి నుంచి సింహాచలం, మద్దిలపాలెం డిపోలకు చెందిన 12 డి ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు కాలువ అవతల నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు పాట్లు అంతా కాదు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు నడ (ర)క యాతన పడుతున్నారు. కొత్తవలస నుంచి వచ్చిన



అక్కడి నుంచి ఆనందపురం నడవాల్సిందే. దేవరాపల్లి, వేపాడ, కె. కోటపాడు నుంచి వచ్చిన వారు ఆనందపురం నుంచి కృష్ణరాయుడు పేట నడవాల్సిందే. సందట్లో సడేమియా లాగా ఆటోవాలా పండగ చేసుకుంటున్నారు. ఈ ప్రాంత ప్రయాణికులు కష్టాలు ఎప్పుడు తీరుస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ప్రజా సంఘాలు కూడా ఆందోళన చేపట్టాయి. తాజాగా మంగళవారం సిపిఎం నాయకుడు డి. వెంకన్న ఆధ్వర్యంలో ప్రయాణికులతో కలిసి దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రజలు ఇన్ని పాట్లు పడుతున్న అటు అధికారులు ఇటు పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన పనులు వెంటనే చేపట్టాలని, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.



# జీఎస్టీ తగ్గింపుపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం

**డుంబ్రిగుడ, జయజయహే.**

మండలంలోని కొల్లాపూటు గ్రామపంచాయతీ పరిధిగల బిట్రగండ,వై కొల్లాపూటు రెవిన్యూ గ్రామాలకు సంబంధించిన గ్రామ ప్రజలకు ఆర్థిక సంస్కరణలు అవగాహన వారోత్సవాలు నేపథ్యంలో ప్రభుత్వాల ఆదేశాల మేరకు బుధవారం జీఎస్టీ తగ్గింపు పై క్షేత్రస్థాయిలో పార్యాటించి స్థానిక సర్పంచ్ పి. రామ్మూర్తి, సెక్రటరీ గురుమూర్తి,అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకున్న ఆర్థిక నిర్ణయంతో జీఎస్టీ 2.0 ఆర్థికంగా ప్రజలకు వ్యాపారస్తులకు మేలు చేకూరే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం సెక్రటరీ మాట్లాడుతూ ఏ ఏ వస్తువుల వాటిపై ఎంతెంత జిఎస్టి తగ్గిందో అవగాహన కల్పించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన సలహా సూచనలు అందించారు. ప్రతి ఒక్కరూ జీఎస్టీ తగ్గింపు పై అవగాహన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వి. భీమన్న, వార్డు సభ్యుడు సుందర్, పెసా కమిటీ సభ్యులు కొండలరావు, ప్రభుదాస్, గ్రామ పెద్ద పండు, నేచర్ సిబ్బంది కస్తూరి కావ్య, డ్వాక్రా మహిళా సంఘా సభ్యులు, అంగన్వాడి కార్యకర్త అప్పలమ్మ, ఆశ కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# పరిశుభ్రతపై ప్రజా ఉద్యమం రావాలి

## సి బి సి రాష్ట్ర డైరెక్టర్ పి రత్నాకర్ పిలుపు

**అనకాపల్లి జయజయహే**

పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో దేశవ్యాప్తంగా స్వచ్ఛత హే సేవ కార్యక్రమం జరుగుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సి బి సి) డైరెక్టర్ పి రత్నాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో బుధవారం జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిరుపయోగం ఉన్న వస్తువులు చెత్త చెదారం పూజలను ఆయన తొలగించారు అలాగే మిగతా వారితో కూడా పరిశుభ్రత పై అవగాహన కలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు భాగస్వామ్యంతో స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించడం లక్ష్యంగా పెట్టుకోవాలని పారిశుధ్యం మెరుగుదలను ప్రతి ఒక్కరు జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కు స్వస్తి చెప్పాలని దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవింగ్ లో నిర్వహించాలని రీసైక్లింగ్ పునర్ వినియోగం బయో మైనింగ్ బయో రేమిడియేషన్ ద్వారా పాత డంపింగ్ యార్డ్ శుభ్రం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న వారు my gov/App లో నమోదు చేసుకుని ఫోటోలను జతపరచడం ద్వారా సర్టిఫికెట్ పొందవచ్చని సమాజం పరిశుభ్రత పట్ల అవగాహన పెంపుదల పౌరుల భాగస్వామ్యం వ్యర్థ పదార్థాలు లేకుండా చేయడం స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలని అని పేర్కొన్నారు. పనికిరాని వస్తువులు వ్యర్థాలను ప్రతి ఏట 100 గంటలు లేదా ప్రతి వారానికి రెండు గంటలు శ్రమదానం చేసి పరిసర పరిశుభ్రంగా ఉండే సంకల్పానికి ప్రతి ఒక్కరు శ్రీకారం చుట్టాలని సి బి సి రాష్ట్ర డైరెక్టర్ రత్నాకర్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు గ్రంథాలయ కోశాధికారి ఆడారి మోహన్ రావు కాండ్రేగుల సత్యనారాయణ ఎస్ఎం నాయుడు ఆడారి గంగాధర్ బొడ్డేడ జగ్గప్పారావు విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయ దర్శనాలు నిలిపితే ఆందోళనలు తప్పవు

## బిజెపి అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్

**వేములవాడ టౌన్, జయజయహే**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో దర్శనాలు నిలిపివేయాలనే చర్యలు తీసుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ హెచ్చరించారు. పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎన్నో దేవాలయాలను అభివృద్ధి చేసినా ఎక్కడా దర్శనాలు నిలిపిన దాఖలాలు లేవని, వేములవాడలో కూడా అదే పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. దర్శనాలు నిలిపితే బీజేపీ పక్షాన తీవ్ర నిరసనలు, ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఏ హిందూ ఆలయాల్లోనూ దర్గాలు ఉండవని, వేములవాడలో దర్గా ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. హిందూ ఆలయాల్లో సమాధులు ఉంటే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ..భీమన్న గుడిలో ఏర్పాట్లు పూర్తికాకముందే రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తామని వినిపిస్తోందని, అలాంటి నిర్ణయం తీసుకుంటే బీజేపీ పక్షాన భారీ స్థాయిలో ధర్నాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిన్నింటి హనుమాన్లు గుడిసె మనోజ్ వివేక్ రెడ్డ కట్కం శ్రీనివాస్. రేగుల రాజకుమార్ మామిండ్ల లక్ష్మీరాజం సగ్గు రాహుల్ బిల్ల కృష్ణ నామాల శేఖర్ నేరెళ్ల సాయి కీసర యశ్వంత్ పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో వేసిన వెంచర్‌కు నోటీసులు!

**- నోటీసులు అందజేసిన మండల ఇంచార్జీ ఈవోపీఆర్డి**

**-నోటీసులు ఇచ్చి రోజులు గడుస్తున్న పట్టించుకోని ఈవోపీఆర్డి, అధికారులు**

**-డి.ఎల్.డి.వో కార్యాలయానికి పక్కనే వెలసిన అక్రమ వెంచర్**

**శ్రీకాళహస్తి, జయజయహే**




తొట్టంబేడు మండలంలో గత వైసిపి ప్రభుత్వంలో భారీగా అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.మండలంలోని శివనాథపాలెం, రామచంద్రాపు రం,కన్నలి,సింగమాల, బసవయ్య పాలెం,తొట్టంబేడు పంచాయతీలలో ప్రభుత్వ భూములను గ్రామ కంఠాలుగా మార్పులు చేర్పులు చేసి, ఫ్రీ హోల్డ్ భూములను సైతం వెంచర్ల ఏర్పాటు చేసి, వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే అక్రమ వెంచర్లను వేయడం జరిగింది. ఇవన్నీ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో తొట్టంబేడు ఇన్చార్జి తాహసిల్దారుగా పనిచేస్తున్నటువంటి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో రికార్డులను తారుమారు చేయడం జరిగిందని మండలంలో విమర్శలు ఉన్నాయి.ఇందులో భాగంగా తొట్టంబేడు రెవెన్యూ పరిధిలో గ్రామ లెక్కల దాఖలలో సర్వేనెంబర్ 269/4 నందు బీడీ కాలనీ వద్ద 1.50 ఎకరముల విస్తీర్ణంలో సుచిత్ర గార్డెన్ అను పేరిట అనధికారికంగా వేసిన లే-అవుట్ ను తొలగించవలసిందిగా మండల ఇన్చార్జిఒపిఆర్డి,తొట్టంబేడు పంచాయతీ సెక్రెటరీ భార్గవ్ నోటీసులు అందజేశారు. కొసమెరుపు ఏమిటంటే గత ప్రభుత్వంలో ఈ సుచిత్ర గార్డెన్ ప్రధాన ద్వారము బ్లూ రంగును వేశారు. అయితే కూటమీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రధాన ద్వారాన్ని పసుపు రంగు మార్చడం జరిగింది. పెద్ద పెద్ద బండ రాళ్ళు,కొండ గుట్టలు క్వారీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఉన్న ప్రదేశంలో పైన బండరాళ్ళను మాత్రమే తొలగించి ఎర్ర మట్టి గ్రావెల్ తో చదును చేసి పైపైన మెరుగులు వేసి తారు రోడ్లు, అందమైన విద్యుత్ దీపాలు అలంకరించి ఈ సుచిత్ర వెంచర్ ను మెరుగుల దిద్దడం జరిగింది. అయితే ఈ వెంచర్లో ప్లాట్ కొన్న వాళ్ళ పరిస్థితి ఏంటి అనేది సందిగ్ధంలో పడింది. కూటమీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి అవినీతికి అక్రమాలకు,తావివ్వకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఈ తాహసిల్దార్ ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకొని ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్న సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.




## కేజియా ఫౌండేషన్ విద్యార్థులకు

# నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ

**అరకులోయ/హుకుంపేట, జయజయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం బూర్జ గ్రామపంచాయతీ బూర్జ గ్రామం నందు గల బూర్జ గవర్నమెంట్ పాఠశాలలో కెజియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు నోటుబుక్స్,పెన్నులు, శుద్ధముక్కలు విద్యార్థులకు కావలసిన సామాగ్రిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెజియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డైరెక్టర్ బూర్జబారికి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి నెల గిరిజన విద్యార్థులకు ఒక గ్రామానికి వెళ్లి ఆ గ్రామంలో పాఠశాలలను చదువుతున్న వంటి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు అలాగే పెన్నులు పెన్సిల్ శుద్ధముకలు వంటి సామాగ్రిలు అందిస్తున్నమన్నారు. అంతేకాకుండా గిరిజన గ్రామాలలో వృద్ధులు ఇంతంతులకు గుర్తించి బట్టలు రగ్గులు దుప్పటి వంటి సామాన్లను పేదలందరికీ అందించడానికి తమ ఫౌండేషన్ ఉందని ఆయన అన్నారు. ప్రతినెల ఒక్కొక్క కార్యక్రమాన్ని చేపట్టి సేవ చేయాలని ఈ కార్యక్రమాన్ని తలపెట్టమన్నారు. అందులో భాగంగానే బుధవారం బూర్జ పంచాయతీలో బూర్జ గ్రామంలో సుమారుగా 36 మంది విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్సిల్, పెన్నా వంటి సామాగ్రిలు అందించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజియా ఫౌండేషన్ సభ్యులు బుర్జబారికి ప్రసాదరావు గెమ్మెలి అప్పలనాయుడు,గెమ్మెలి చిన్నమ్మి, సైమన్ మరియు తదితరులు పాల్గొన్నారు.





# "సుంకరమెట్ట"లో రెవెన్యూ కోటర్స్ బిల్డింగ్‌లో ప్రైవేట్ వ్యక్తుల నివాసం:

**ప్రజల ఆరోపణలు తీవ్రమవుతున్నాయి**

**అరకులోయ: జయజయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకువేలి మండలం, సుంకరమెట్ట గత రెండు సంవత్సరాలుగా రెవెన్యూ కోటర్స్ బిల్డింగ్‌లో ప్రైవేట్ వ్యక్తులు అనధికారంగా నివసిస్తున్నారని స్థానికులు గంభీర ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని అనుమతి లేకుండా ఉపయోగించడం సరైనది కాదని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.సుంకరమెట్ట గ్రామం, అరకువేలి మండలంలో ఉన్న రెవెన్యూ కోటర్స్ భవనం రెవెన్యూ శాఖకు చెందిన ప్రభుత్వ ఆస్తి. అయితే, గత రెండేళ్లుగా ఇక్కడ ప్రైవేట్ వ్యక్తులు నివాసంగా ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. "ఇది ప్రభుత్వ భవనం. ఎటువంటి అధికారిక అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులు ఇక్కడ ఉండటం తప్పుడే. ఇది రాష్ట్ర ఆస్తులపై దాడి" అని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, "పంచాయతీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు లేదా ఎంప్లాయిలు ఉండవచ్చు. కానీ ప్రైవేట్ వ్యక్తులు ఎందుకు? ఇది సరైనది కాదు" అని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులను అడిగినప్పుడు, వారు "బిల్డింగ్ మరమ్మత్తు చేసి, డబ్బులు ఇచ్చాము కాబట్టి ఇక్కడ ఉంటున్నాము" అని సమాధానం ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నబాబు తక్షణమే మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) జోక్యం తీసుకోవాలని, రెవెన్యూ కోటర్స్ భవనాన్ని పంచాయతీ అధీనంలో అప్పగించాలని డిమాండ్ చేశారు. "పంచాయతీ అవసరాలకు ఉపయోగపడితే మాత్రమే ఇది సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల చర్యలు కావాలి.రెవెన్యూ కోటర్స్ భవనాన్ని అద్దెకు ఇచ్చారా లేదా అమ్మేసారా అనే అనుమానాలు గ్రామంలో వ్యాప్తమవుతున్నాయి. "ఏ అధికారిక ఆర్డర్ లేకుండా ఇలా జరగడం ఆశ్చర్యకరం. రెవెన్యూ శాఖ అధికారులు దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు కోరారు. సర్పంచ్ చిన్నబాబు తోటివారితో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో...

# విద్యార్థుల్లో జీఎస్టీ 2.0 పై అవగాహన ర్యాలీ

**పాలకొండ,జయజయహే**







జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పేద మరియు మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాలకొండ ప్రభుత్వ బాలికలు జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బొబ్బిలి రేణుక విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపనున్నాయని తెలిపారు.20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నట్లుగా,నూతన జీఎస్టీతో 90 శాతం కుటుంబాల కొనుగోలు శక్తి పెరిగి,నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని వివరించారు.నూతన జీఎస్టీ రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చాయని, పాత 4 కేటగిరీల (5%, 12%, 18%, 28%) బదులు ఇప్పుడు కేవలం 2 కేటగిరీలు (5%, 18%) మాత్రమే ఉండేలా పునర్వ్యవస్థీకరించారని చెప్పారు.ఆహార పదార్థాలు,ప్రాణరక్షక మందులు,వైద్య పరికరాలు,విద్యా సామగ్రిపై పన్నులు 0% లేదా 5% వరకు తగ్గించబడ్డాయని విద్యార్థులకు వివరించారు.జీఎస్టీ సంస్కరణల వల్ల వినియోగదారులకు లభించే మేలును ప్రతి ఒక్కరికీ చేరేలా చార్టర్డ్ అకౌంటెంట్లు,వాణిజ్య మండళ్లు, విద్యాసంస్థలు కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.. సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం,దేశ ఆర్థిక వ్యవస్థ బలపడటం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని గుర్తు చేశారు. ముందుగా విద్యార్థులకు 'భారత అభివృద్ధి కథనానికి జీఎస్టీ 2.0 తో బలమైన తోడ్పాటు" అనే అంశంపై వ్యాసరచన,వక్తృత్వ పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు "జీఎస్టీతో ప్రజల అభ్యున్నతి", "సంస్కరణలతో సుస్థిర అభివృద్ధి" అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు యు. సత్యప్రభ, వి. రమేష్, ఎ. విజయగౌరి, బాలమురళి, పుష్పనాధం, ప్రతాప్,లావణ్య, రమ్య, సింహాచలమమ్మ, ధనలక్ష్మి,రుక్సేనా బేగం,సచివాలయం కార్యదర్శి డి.ప్రభు సాగర్,తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడి కేంద్రాలలో ఆన్‌లైన్ పనులు సక్రమంగా నిర్వహించాలి

**ఐటిసిఎంసికె ప్రథమ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతిరావు**

**ముంచంగిపుట్టు, జయ జయహే**

అంగన్వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ పనులు సక్రమంగా నిర్వహించాలని ఐటిసిఎంసికె ప్రథమ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అంగన్వాడీలకు నిపుణభారత్ గైడ్లైన్స్, మూడు సంవత్సరాలు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు పోషణలో తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రథమ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతిరావు మాట్లాడుతూ చిన్నారులు ఎదుగుతున్న సమయంలో సక్రమం తప్పకుండా పౌష్టిక అహారం అందిచేలా అంగన్వాడీలు చర్యలు తీసుకుకోవాలని అన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో యాప్ల ద్వారా పనులు జరగాలని,ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని అధికమించేలా ఏర్పాట్లు చేసుకోవాలని, యాప్ల పని తీరు మెరుగుపడితే అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడం ఇబ్బందులు తొలగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ధర్మారావు, సిడిపివో విమలకుమారి, సూపర్వైజార్లు, అంగన్వాడీలు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.

# నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల రీఫరీగా నాగజ్యోతి

**రోలుగుంట, జయజయహే**



కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ (ఎన్ పి ఎఫ్) కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ (ఆర్ ఏ డబ్ల్యు) సంయుక్తంగా నిర్వహిస్తున్న "నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్ (ఆర్ ఏ డబ్ల్యు) - 2025" పోటీలు ఈ నెల 9, 10, 11, 12 తేదీలలో బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని ఎస్పోర్టో రిక్రియేషన్ హబ్ వద్ద జరగనున్నాయి.ఈ జాతీయ స్థాయి పోటీలకు మ్యాచ్ రిఫరీగా రోలుగుంట హై స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి.వి.ఎం. నాగజ్యోతి నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ తరఫున ఎంపిక కావడం విశేషం. ఈ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్,టీన్ బాయ్స్ అండ్ గర్ల్స్, జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్స్ ఒకటి, రెండు, మూడు విభాగాలలో పోటీలు నిర్వహించబడనున్నాయని నాగజ్యోతి తెలిపారు. ఇప్పటికే నాగజ్యోతి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ కాంపిటీషన్లలో పాల్గొని అనేక పతకాలు సాధించారు. క్రీడల పట్ల ఆమె చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదల యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.ఆమె సేవాభావం, క్రీడాస్ఫూర్తి, పవర్ లిఫ్టింగ్ రంగంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించడం ఆమెకు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణం. ఈ సందర్భంగా పలువురు క్రీడాభిమానులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు,స్థానిక ప్రజలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# వసతి గృహాల్లో, పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు

**ప్రత్యేక అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్టణం, జయజయహే**



ఇటీవల కురుపాం గురుకుల పాఠశాల వసతి గృహంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాల్లో, పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. ఆయా మండల, జోనల్ ప్రత్యేకాధికారులు వసతి గృహాలను, పాఠశాలలను సందర్శించాలని, అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. తాగునీటి పైప్ లైన్లు లీకులను సరిచేయాలని, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల నుంచి అనుసంధానమయ్యే పైపులను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలుంటే సరిచేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అందరినీ అప్రమత్తం చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖల పరిధిలోని వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్, గురుకులాలు, కేజీబీవీల్లోని తాజా పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆయా ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# తల్లితండ్రుల పేరు చిరస్మరణీయం చేసిన అవంతి

## మాజీ మంత్రి అవంతి హృదయాన్ని తాకే సేవా యజ్ఞం

**ముసునూరు,జయజయహే**

జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడు చాలా మంది తమ మూలాలను మరచిపోతారు.కానీ కొందరు మాత్రం స్థితి కలిగినప్పటికీ గతిని మరువరు.అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరు మాజీ మంత్రి,అవంతి విద్యాసంస్థల అధినేత ముత్తంశెట్టి అవంతి శ్రీనివాసరావు.తన పుట్టిన ఊరు ను తల్లిలా భావించిన ఆయన, అడగకుండానే ఏమి కావాలో ఊరికి అందించే అరుదైన మనసు కలవారు. ఆ మనసులోంచి పుట్టిన మరో అద్భుతం "శ్రీ ముత్తంశెట్టి వెంకట నారాయణ – నాగేశ్వరమ్మ కళ్యాణ మండపం".

**తల్లిదండ్రుల స్మరణలో హృదయపూర్వక అంకితం**

గోపవరం గ్రామంలోని ప్రశాంత వాతావరణంలో, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మాజీమంత్రి అవంతి శ్రీనివాసరావు,తన సతీమణితో కలిసి కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు.ఈ వేడుక కేవలం ఒక






నిర్మాణం ప్రారంభం కాదు..అది ఆయన తల్లిదండ్రులపై గల అనురాగానికి, గ్రామంపై గల మమకారానికి ప్రతీక.

"అవంతి శ్రీనివాసరావు మా ఊరి గర్వకారణం," అని గ్రామ పెద్దలు చెబుతూ కళ్ళలో ఆనందం మెరిపించారు.గ్రామంలో మూడు ఎకరాలు కొనుగోలు చేసి కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయం నిర్మించారు. ఇప్పుడు ఒక కోటి రూపాయలతో ఈ కళ్యాణ మండపం నిర్మించారు. అంతేకాదు,బస్ స్టాప్ నిర్మాణం,ప్రభుత్వ ఆయుర్వేద హాస్పత్రికి రూ.5 లక్షల సహాయం వంటి ఎన్నో సేవలు చేశారు.

**గ్రామానికి ఆనందం, ప్రజలకు ఆత్మగౌరవం..**

వివాహాలు, సామాజిక కార్యక్రమాల కోసం సదుపాయం లేక ఇబ్బంది పడిన గ్రామ ప్రజలు, ఇప్పుడు కొత్త కళ్యాణ మండపం రూపంలో ఒక శాశ్వత పరిష్కారాన్ని పొందారు.ఇది మాకు కేవలం భవనం కాదు, మన ఊరిని గుర్తు చేసే గర్వచిహ్నం..అంటారు గ్రామస్తులు.

**సేవలోనే జీవితం..**

సొంత నిధులతో, సొంత ఊరికి సేవ చేయడం అంటే కేవలం దాతృత్వం కాదు, అది హృదయ పూర్వక ప్రేమ.అవంతి, ఆ ప్రేమను ప్రతి అభివృద్ధి పనిలో చూపిస్తున్నారు.తల్లిదండ్రుల పేరును చిరస్మరణీయం చేస్తూ, గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించే ఆయన సేవలు స్ఫూర్తిగా నిలిచాయి.భవిష్యత్ తరాలకు ఒక సందేశం పంపుతూ అవంతి శ్రీనివాసరావు సేవా యజ్ఞం చెబుతోంది.స్థానం తాత్కాలికం, సొంత ఊరికి సేవ శాశ్వతం.



## సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమం

**యలమంచిలి, జయ జయహే**

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో వివిధ సమస్య లపై 150 అర్జీలను ప్రజలు ఎమ్మెల్యేకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ మోటూరు గోపీనాథ్, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, లాలం సోమనాయుడు, ఇత్తం శెట్టి సన్యాసినాయుడు, రాజాన నారాయణమ్మ, నూకన్నదొర, కరణం రవి, గుర్రాల శేఖర్, లవుడు లావరాజు, ఉటకూటి రమేష్, కోరారు శ్రీను, సత్యనారాయణ, సతీష్, చిట్టిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## అక్టోబరు 25వ తేది లోగా రైతుసేవ కేంద్రాల్లో ఈ పంట నమోదు చేయించుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి సి. సుమంత

**యలమంచిలి, జయజయహే**

రాంబిల్లి మండలంలో రైతులందరూ అక్టోబరు 25వ తేది లోగా ఆయా రైతుసేవకేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సి. సుమంత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 7845 ఎకరాల మొత్తం సాగువిస్తీర్ణంలో ఇప్పటికి 4971 ఎకరాలు వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట నమోదు చేయడం జరిగిందని అన్నారు. ప్రకృతి వైపరీత్యము ల వలన పంటనష్టం, వ్యవసాయ పరికరాల సబ్సిడీ, పంట భీమా, ధాన్యం కొనుగోలు మొదలైన వాటికి పంట నమోదు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటివరకు రైతుసేవకేంద్రాల ద్వారా 421 టన్నుల యూరియా 36 టన్నుల డిఎపి, 20 టన్నుల యం.ఓ.పి. సరఫరా చేయడమైనదని అన్నారు. పంచదార్ల గ్రామంలో ఈపంట నమోదును పరిశీలించడం జరిగిందని తెలిపారు.




## పంప్ ఆపరేటర్లకు బకాయిజీతాలు చెల్లించాలి

### సిఐటియు

**యలమంచిలి, జయజయహే**

రాంబిల్లి మండలం, జెడ్ చింతవా పంచాయతీ లోని, లోవపాలెం, గజ రెడ్డి పాలెం, వెంకయ్యపాలెం గ్రామాల పంప్ ఆపరేటర్లకు గత మూడు సంవత్సరాలుగా జీతాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడు నాయుడు అన్నారు. పంప్ ఆపరేటర్ల సమస్యపై, అనేకసార్లు పంచాయతీ కార్యదర్శి కి మండల అభివృద్ధి అధికారికి, స్పెషల్ ఆఫీసర్ అయిన తాసిల్దార్ కు తెలియపరిచినప్పటికీ నేటికీ పంప్ ఆపరేటర్లకు బకాయి జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు ఈ సమస్యపై స్పందించి గంగరాజు, కోదండమ్మ, రమణకు బకాయి జీతాలు చెల్లించి ఆదుకోవాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించి నిరసన చేపట్టారు.



## ఈనెల 12వ తేదీన నేను నా యువత

**యలమంచిలి, జయ జయహే**

నేటి యువతను దేశం కోసం, సమాజ అభివృద్ధి కోసం భాగస్వామ్యం చేసేందుకు నేను నా యువత కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీన రాంబిల్లి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అనంతరం కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి యువతను ప్రభావశీలులుగా తయారు యుచేసేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిగా తాను ప్రయత్నిస్తున్నానన్నారు. ఈరోజు నుంచే ఉత్సాహవంతమైన యువకులు 7577887777 కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ మోటూరు గోపీనాథ్, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, లాలం సోమనాయుడు, ఇత్తం శెట్టి సన్యాసినాయుడు, రాజాన నారాయణమ్మ, నూకన్నదొర, కరణం రవి, గుర్రాల శేఖర్, లవుడు లావరాజు, ఉటకూటి రమేష్, కోరారు శ్రీను, సత్యనారాయణ, సతీష్, చిట్టిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ డంపింగ్ యార్డ్ చెత్త కుప్పలపైన డ్రోన్ ద్వారా సుగంధ ద్రవ్యం చల్లి ప్రయోగం

### -చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రయోగం..

**జంగారెడ్డిగూడెం, జయజయహే**

పారిశుద్ధ్య కార్యక్రమంలో డ్రోన్ ల సంస్కృతికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా లోమొదటగా చింతలపూడి నియోజకవర్గంలోని తొలి ప్రయోగంగాదీన్ని అమలు చేస్తున్నారు. బుధవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం లో చింతలపూడి శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ ఈ కార్యక్రమానికి అంకు రార్పణ చేశారు. తన ప్రతి చర్యలోను ఒక నూతనత్వాన్ని ఆవిష్కరించే శాసనసభ్యుడు రోషన్ కుమార్ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో వినూతనంగా డ్రోన్ ల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. జనావాసాల మధ్య పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడే దుర్గంధం అదుపు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనే ఆలోచనతో నిజంగా అద్భుతమైనదే. తొలిసారిగా జంగారెడ్డిగూడెంలో డ్రోన్లను ఉపయోగించి చెత్త కుప్పలమీదక్రిమి సంహారం కోసం మందులు డ్రోన్ ద్వారా చల్లి కొత్త విధానాన్ని పరిచయం చేశారు. తద్వారా నూతన ఒరవడికి నాంది పలికారు. పట్టణంలో మెయిన్ డంపింగ్ యార్డ్ లో చెత్తా,చెదారంపై క్రిమిసంహారక మందులు పిచికారి చేయించడంతో పాటు దుర్గంధం వెదజల్లే ప్రాంతంలో సువాసనలతో కూడిన మందు పిచికారీ చేసే నూతన వరవడికి నాంది పలికారు.ఈ పద్ధతి అందరి మన్ననలను పొందు తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఉత్తరాంధ్రలో అలజడులు సృష్టించేందుకే జగన్ పర్యటన






## మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

**యలమంచిలి, జయ జయహే**

ఉత్తరాంధ్రలో అలజడలు సృష్టించేందుకే జగన్ పర్యటిస్తున్నారని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. అచ్చుతాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అచ్చుతాపురం మండల తెలుగుదేశం పార్టీ సమావేశం మండల అధ్యక్షులు పీల తులసిరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ శ్రీ పప్పల చలపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం పనిచేస్తున్న కార్యక్రమాలు, పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని, కూటమి పార్టీల సమన్వయంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలను నష్టం కలగకుండా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని, చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ పథకాలలో సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమని ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని కోరారు. వైసిపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రశాంతంగా ఉన్న ఉత్తరాంధ్రలో సృష్టించేందుకే వస్తున్నాడని, గత ఐదేళ్లు పాలల్లో విధ్వంసం సృష్టించారని, పి పి పి కి ప్రైవేటీకరణకు తేడా తెలియకుండా వైసీపీ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని తెలిపారు. కులాల మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి అబ్బో గడుపుకోవాలని వైసిపి పార్టీకి చెందిన నాయకులు అనుకుంటున్నారని, అటువంటివి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, 17 మెడికల్ కాలేజ్ లో అందుబాటులోకి వస్తే ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి ఎంత నిర్లక్ష్యం చేశాడో ఎంత ద్రోహం చేశాడో ప్రజలకు తెలిసిపోతుందని అన్నారు. ఈ నాటకాలు డ్రామాలు వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తులు చేస్తున్నారని, పిపిపి మోడల్ అంటే ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం కాదని, వైద్య కళాశాల ఆసుపత్రి నిర్మించి 33 ఏళ్ల నిర్వహించిన తర్వాత ప్రభుత్వానికి అప్పగించి వెళ్లడమని తెలిపారు ప్రభుత్వ ఆస్తి భద్రంగా ఉంటుందని రోగులకు ఉచిత సేవలు అందుతాయని, ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తుంటే జగన్మోహన్ రెడ్డి చెడగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, పీ ఏ సీ ఎస్ చైర్మన్లు రమణ, జగప్పారావు, రెడ్డి నగేష్, పోనమల్ల కొండబాబు, లాలం రాజు, పుర్రె శ్రీనివాసరావు, యాంద్ర అప్పల నాయుడు, లాలం రమణ, శివ బాపు నాయుడు, ఐటీడీపీ ఇంచార్జ పతివాడ చిన్నయ్య నాయుడు, రాజాన రామనాయుడు, కట్టమూరు చిత్తేశ్వరరావు, దేశం శెట్టి అప్పలనాయుడు, ఎల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ పర్యటన అంతా జగన్నాటకమే

**మెడికల్ కాలేజీ మీద**

**జగన్మోహన రెడ్డి మొసలి కన్నీరు**

**పర్యటన పేరుతో అల్లర్లు సృష్టించటమే లక్ష్యం**

**వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, జయజయహే**



మెడికల్ కళాశాలల పేరుతో మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న విశాఖ పర్యటన అంత జగన్నాటకమని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటన లో మండిపడ్డారు. కూటమి పాలనలో ప్రశాంతంగా ఉన్న విశాఖ లో అల్లర్లు సృష్టించి, శాంతి భద్రతల కు విఘాతం కలిగించాలని వైస్సార్సీపీ నాయకులు చూస్తున్నారని, గతంలో వివిధ ప్రాంతాల్లో జగన్ పర్యటన లో ఇలాంటి సంఘటనలు చూశామని పేర్కొన్నారు. జగన్ పాలనలో 17 మెడికల్ కాలేజీలు మొదలుపెట్టి అర్ధాంతరంగా వదిలేశారని, ?8,500 కోట్ల కు కేవలం ?1,451 కోట్లు మాత్రమే ఖర్చు చేసారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్య నిమిత్తం నిధులు కేటాయిస్తే వాటిని పార్టీ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. పీపీపీ పద్ధతి అంటే నిర్మాణం ప్రైవేట్ దని, నిర్వహణ మాత్రం ప్రభుత్వమే చూస్తుందని, ప్రైవేట్ కి, పీపీపీ కి కనీసం తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. పేదల కోసం ఉచిత వైద్య సేవలు, ఉచిత విద్య అందించటం కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వైసీపీకి మాత్రం పార్టీ ఆఫీసులే ప్రాధాన్యమని తెలిపారు. మాస్క్, పీపీఈ కిట్ లు అడిగిన పాపానికి దళిత వైద్యుడు సుధాకర్ ను మానసికంగా వేధించి అయన మృతికి కారణమయ్యారని, పీపీఈ కిట్లు, మాస్క్ లు అందించలేని మీరు మెడికల్ కళాశాలను ఎలా పూర్తి చేస్తారనుకున్నారు అని ఎద్దేవా చేసారు. ముందుగా డాక్టర్ సుధాకర్ కుటుంబానికి క్షమాపణ చెప్పని మీరు జిల్లాలో అడుగుపెట్టి అర్హత లేదు అని పేర్కొన్నారు. విశాఖను రాజధాని చేస్తానని ప్రజలను మభ్య పెట్టి విశాఖ లో భూములను దోచుకున్నారని, కేవలం ప్యాలెస్ కట్టడానికి ప్రాధాన్యత ఇచ్చిన మీరు విశాఖలో మరి ఏదైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. కోడి గుడ్డు మంత్రి గా పేరొందిన అమర్నాథ్ విశాఖకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు. ఆయన చేసిన అభివృద్ధి విసన్నపేట వెళ్తే తెలుస్తుంది అని పేర్కొన్నారు. పులివెందుల ఎమ్మెల్యే వై ఎస్ జనగ్మోహనరెడ్డి విశాఖ పర్యటన ను ఉత్తరాంధ్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, విశాఖ ప్రశాంతతకు ఎక్కడ భగ్నం కలుగుతుందోనని విశాఖ వాసులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. విశాఖ రాజధాని పేరిట విశాఖ ను దోచుకున్న జగన్మోహనరెడ్డి ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేసారు. వైద్య కళాశాల నిర్మాణం కన్నా రుషికొండ లో ప్యాలస్ నిర్మాణానికి 500 కోట్ల కేటాయించిన మీరు మెడికల్ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదు అని పేర్కొన్నారు,

# భారత్ నిర్ణయాలను శాసించలేం

**ఎవరితో సంబంధాలు**
**కొనసాగించాలన్నది వారి ఇష్టం**

**రష్యా చమురు కొనుగోళ్లే భారత్ ఆర్థికి వృద్ధికి కారణం కాదు**

**ట్రంప్ సలహాదారు**
**జెమీసన్ గ్రీర్ వెల్లడి**



అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూదిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు. దీనిని బట్టి మెల్లగా వాస్తవాలను ట్రంప్ బృందం గుర్తిస్తోందని తెలుస్తోంది.

# భారత్‌తో యుద్ధ ప్రమాదం తొలగిపోలేదు

**అలాంటిది వస్తే ఈసారి మాదే పైచేయి**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్**



ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. 'భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.

# ఏరియా హాస్పిటల్‌లో అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశం

**ఎమ్మెల్యే రోషన్ కుమార్ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం**





**జంగారెడ్డిగూడెం, జయజయహే**

వైద్య రంగంలో సేవలన్ని పారదర్శకంగా నిర్వహించడం అవసరం అని ఆరోపణలు వచ్చిన వారిపై చర్యలు తప్పవని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశించినట్టు తెలిసింది. స్థానిక ఏరియా హాస్పిటల్ లో బుధవారం జరిగిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ( హెచ్ డి సి ) కి చైర్మన్ హెూదా లో ఎమ్మెల్యే అధ్యక్షత వహించారు. సమావేశం లో ఆయన తీవ్ర అసంతృప్తి తో మాట్లాడుతూ అసహనం వ్యక్తం చేసారని సమాచారం. తామర తంపరగా హాస్పటల్ లో వైద్యులు, సిబ్బంది పై వస్తున్నఅవినీతి ఆరోపణలు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విచారణ అధికారిని ఆదేశించారని సమాచారం. పలు అంశాలు వివాదస్పదం గా మారటం తో ఆయన అసహనం వ్యక్తం చేసారని తెలిసింది. ఎంత సర్దు కు పోదామన్నా సాధ్యం కానీ పరిస్థితి ఆయన్ను ఇరకాటం లో పడవేసినట్టుగా వుంది అని అంటున్నారు. .అలాగే హాస్పిటల్ సూపరింటెండ్ తదితరుల వ్యవహార శైలి గురించి అభివృద్ధి కమిటీ ద్వారా మీడియా ద్వారా వస్తున్న ఫిర్యాదులపై ఎమ్మెల్యే మండి పడ్డారని ఇటీవల హాస్పిటల్ లో డయాలసిస్ వార్డ్ లో జరిగిన రగడ మీడియా ద్వారా వెల్లడి కావటం తో దానిపై కూడా విచారణ జరపాలని కోరారని తెలిసింది. ప్రభుత్వం ఆశిస్తున్నవిధంగా పేద రోగులకు సరైన వైద్యం అందించాలని అవినీతి రహిత సేవలు ఆయన కావాలని కోరారని తెలిసింది. సమావేశం లో హాస్పిటల్ సూపరింటెంట్ బేబీ కమల, మున్సిపల్ కమీషనర్ కెవి రమణ అభివృద్ధి కమిటీ సభ్యులు కంచర్ల గణేష్, నాయుడు శ్రీనివాస్, కోటగిరి ప్రమీల ఆర్ ఎం ఓ పాల్ తదితరులు పాల్గొన్నారు.

**హాస్పిటల్ లో మొదలైన విచారణ..**

హాస్పిటల్ లో జరుగుతున్న అవినీతి కార్యకలాపాల పై అభివృద్ధి కమిటీ సభ్యులు రోగులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం నిమించిన విచారణ అధికారి డా. వెంకటేశ్వరరావు సాగించారు. ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం ఆయన ఆరోపణలు వచ్చిన వారి సమాచారం సేకరించి నివేదిక ఇవ్వవలసి వుంది. హాస్పటల్ లో గత14సంవత్సరాలనుండి పని చేస్తున్న ఒక ఉద్యోగి పైనే ఎక్కువగా ఆరోపణలు రావడం విశేషం. సూపరిండెంట్ ప్రతినిధి గా అవ్యక్తి అన్ని డ్యూటీలు తానే నిర్వహించడం జరుగుతుందని ప్రధాన ఆరోపణ. హాస్పిటల్ లో దాదాపుగా ప్రధాన విభాగాల్లోసూపరింటెండ్ బంధువులు, ఆమె అనుచరులు పని చేయటం పై ఆరోపణలు వెల్లు వేత్తాయి. ఇందులో వాస్తవాలు విచారణ లో వెలుగు చూస్తా యని భావిస్తున్నారు.




# జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన నిలిపివేత

**- గంటకు 102 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన నష్టం**

**- అంధకారంలో ప్రాజెక్ట్ పరిసర గ్రామాలు**

**ముంచంగిపుట్టు, జయజయహే:**

ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో బుదవారం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. విద్యుత్ కేంద్రం నుండి ఒడిశా రైల్వే ఫీడర్లను పునరుద్ధించడానికి నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ ఏ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఒడిశా రైల్వే ఫీడర్ సాంకేతిక లోపాలను సరిచేసి ఫీడర్లైన్లను పునరుద్దించడానికి ఒడిశా విద్యుత్ సరఫరా శాఖ(ఒపిటిసిఎల్) వారు ప్రాజెక్టు అధికారులను ఒక రోజు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని కోరారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. ఈ ఫీడర్లు అనుసందానం చేయడం వలన విద్యుత్ కేంద్రం నుంచి లంతాపుట్టు సమితి మీదగా ఒడిశాకు చేరుతున్నట్లు ఒడిశా విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రసుత్తం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయడంతో గంటకు 102 మెగావాట్లు ఉత్పత్తి నష్టం వాటిల్లుతుంది. ప్రాజెక్టు నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడం వలన ఒనకఢిల్లీ, మాచ్ ఖండ్ ,జోలాపుట్టు గ్రామాలతో పాటు పరిసర గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.



# వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో శస్త్ర చికిత్సలు

**24 గంటల్లో 20 ఆపరేషన్లు**

**వైద్యులకు సూపరింటెండెంట్ అభినందన**

**వేములవాడ టౌన్, జయజయహే**

వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో మరో సారి 24 గంటల్లో 20 వివిధ రకాలఆపరేషన్లువిజయవంతంగా పూర్తి చేశారు వైద్యులు. ఇందులో సాధారణ కాన్పులు 4, ఆపరేషన్లు ద్వారా 9, కంటి ఆపరేషన్లు 4, జనరల్ సర్జరీలు 2 , ఆర్థో ఆపరేషన్ ఒకటి ఉన్నాయి. ఆపరేషన్లు చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్లు సంధ్య, సోనీ, మాధవి ,పిల్లల వైద్యులు సుభాషిణి, చారి, రమణ, ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్,మత్తు వైద్యులు రాజశ్రీ, తిరుపతి, రవీందర్,కంటి వైద్యులు డాక్టర్ రత్నమాల, నర్సింగ్ ఆఫీసర్స్ ఝాన్సీ, జ్యోతి,అనసూయ, బ్లోసమ్ తో పాటు ఇందులో పాల్గొన్న ఇతర సిబ్బంది ని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య అభినందించారు. పేద ప్రజలకు రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అంకిత భావంతో అందించాలని తెలియజేశారు.




# మానవతా సేవ ద్వారా సమాజాలను బలోపేతం చేయవచ్చు

**-కనకరాజు జన్మదిన సందర్బంగా మానసిక స్కూల్ కు స్టీల్ కంచాలు,గ్లాసులు పంపిణీ**

**భీమవరం, జయజయహే**

మానవతా సేవ ద్వారా సమాజాలను బలోపేతం చేయవచ్చునని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ వబిలిశెట్టి కనకరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్, క్లబ్ కోశాధికారి కనగర్ల విజయ రామకృష్ణ అన్నారు. భీమవరం కిషోర్ థియేటర్ రోడ్డులోని భవిత స్కూల్లో (మానసిక స్కూల్) బుధవారం ఇంటర్నేషనల్ లయన్స్ డే, వబిలిశెట్టి కనకరాజు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ కు స్టీల్ కంచాలు, గ్లాస్ లు, బిస్కెట్స్, చాక్లెట్స్ , పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రపంచ వ్యాప్తంగా 200కు పైగా దేశాలలో సామాజిక సేవలు అందిస్తుందని అన్నారు. సమాజ సేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అంకితమైయిందని అన్నారు. క్లబ్ అధ్యక్షులు బొండా రాంబాబు మాట్లాడుతూ సౌమ్యులు శాంతిపరులు సమాజసేవలో ముందుంజ వరుసలో ఉండే మనసున్న వ్యక్తి కనకరాజు అని అన్నారు. కనకరాజు మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని, మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలి అన్నారు. కార్యక్రమం లో అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి. శ్యామ్ సుందర్, ఐ. ఇ. కోఆర్డినేటర్ టి. శ్రీనివాస్, హెడ్ మాస్టర్ పి. శ్రీనివాసరావు, స్కూల్ సిబ్బంది ఆర్. లిల్లీ గ్రేస్, వై. పెద్ది రాజు, బి. దుర్గ, భట్టిప్రోలు శ్రీను, లయన్స్ సభ్యులు నందమూరి రాజేష్, కొప్పర్తి రాము, డా వంగా వంశీ కృష్ణ మరియు విద్యార్థుల పాలుగొన్నారు.

## టెస్టు ర్యాంకింగ్స్.. సిరాజ్, జడేజాకు

# కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు

భారత క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు అందుకున్నారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గణనీయంగా స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. ఈ హైదరబాదీ పేసర్‌కు టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు ఇవే. జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు.

సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (644 పాయింట్లు) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి ఎగబాకాడు. విండీస్‌పై జడేజా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (104బి) చేసిన సంగతి తెలిసిందే. ఇదే మ్యాచ్‌లో శతకం (100) బాదిన కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు జంప్ అయి 35 స్థానానికి చేరుకున్నాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.





# ఇక మారవా పృథ్వీ.. ఇంకెన్ని తప్పులు చేస్తావ్?



'నువ్వు ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారీ యు ప్రూవ్డ్ మి రాంగ్"... ఇదీ తెలుగు సినిమాలోని ఓ డైలాగ్. ఇప్పుడు ఈ డైలాగ్ ఎందుకు అంటారా? భారత యువ క్రికెటర్ 'వివాదాస్పద' ప్రవర్తనకు సరిగ్గా అతికే మాటలు ఇవి. అతడి తీరును చూసి 'ఇంకెప్పుడు' మారతావు అంటూ బయట నుంచి విమర్శలు రావడం మొదలయ్యాయి. ఆ ప్లేయర్ ఇంకెవరో కాదు పృథ్వీషా.. క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు అతడొక హాట్ టాపిక్.

మొన్నటివరకూ సరైన ప్రదర్శన ఇవ్వకుండా విమర్శలకు గురైన పృథ్వీ.. ఆటపరంగా దారిలో పడ్డాడని సంబరపడేలోగా తన 'తీరు'తో ఇక్కట్లు కొనితెచ్చుకున్నాడు. ఒకప్పుడు కలసికట్టుగా ఆడిన మాజీ సహచరుడి పైనే 'బ్యాట్' ఎత్తేవరకూ వెళ్లాడు. కాలర్ పట్టుకొని వివాదాస్పదరీతిలో ప్రవర్తించాడు. ముంబయి - మహారాష్ట్రల మధ్య జరుగుతున్న మూడు రోజుల మ్యాచ్‌లో పృథ్వీషా బరిలోకి దిగాడు. మహారాష్ట్ర తరఫున ఆడిన అతడు భారీ శతకం (181) కూడా సాధించాడు. ఇంకాస్తలో డబుల్ సెంచరీ చేయడం ఖాయమని భావించాడు. అయితే, ముంబయి బ్యాటర్ ముషీర్ ఖాన్ వేసిన లెగ్ సైడ్ బంతిని భారీషాట్‌కు యత్నించిన పృథ్వీ లాంగ్‌లో దొరికిపోయాడు. బౌలర్ ముషీర్ ఖాన్ 'థాంక్యూ' అనే మాట అనడంతోనే వివాదం మొదలైందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. దానికి సీరియస్‌గా రియాక్ట్ అయిన పృథ్వీ తన బ్యాట్‌ను ముషీర్ వైపు తిప్పాడు. కొద్దిలో ముషీర్‌ను తాకేదే కానీ, అప్పటికే అతడు తప్పించుకున్నాడు. అయినాసరే వదలని పృథ్వీ మరింత దూకుడుగా ముషీర్ వైపు వెళ్లి కాలర్ పట్టుకోవడం, ఆ తర్వాత దుర్భాషలాడటం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనతో అతడు కష్టపడి చేసిన 181 పరుగుల ఇన్నింగ్స్ కనుమరుగైంది. ఇదే మొదటిది అనుకుంటే పొరపాటే. పృథ్వీ షా కెరీర్‌లో ఇలాంటివి చాలా వివాదాలూ ఉండటం గమనార్హం.

### సప్నా గిల్ ఉదంతం..

రెండేళ్ల కిందట పృథ్వీ షా ఓ రెస్టారంట్‌కు వెళ్లినప్పుడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సప్నా గిల్‌తో వివాదమైంది. సెల్ఫీలు అడుగుతూనే ఉండటంతో ఆమె నుంచి తప్పించుకొనే క్రమంలో కాస్త హార్ష్‌గా ప్రవర్తించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. దీంతో ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసే వరకూ వెళ్లింది. ఆ తర్వాత సోషల్ మీడియాలోనూ ఇరువురి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి.

### డోపింగ్‌లో విఫలమై.. సస్పెన్షన్

2019లో పృథ్వీషాపై బీసీసీఐ ఎనిమిది నెలల నిషేధం విధించింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా డోపింగ్ టెస్టులో విఫలమయ్యాడు. నిషేధించిన మందులను వాడినట్లు అప్పట్లో తేలింది. దీంతో అతడిపై బీసీసీఐ బ్యాన్ విధించింది. గతేడాది పృథ్వీ షా ఫిట్‌నెస్ లెవల్స్ మరీ పడిపోయాయి. అతడి బాడీలో ఫ్యాట్ పర్సంటేజీ 35 శాతానికి చేరినట్లు నివేదికలు వచ్చాయి. దీంతో రంజీ, విజయ్ హజారే ట్రోఫీ స్క్వాడ్ నుంచి ముంబయి అతడిని తప్పించింది.

ఐపీఎల్‌లోనూ అతడి తీరు వివాదాస్పదమే. దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వీషా తమ జట్టు ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ పైనా విమర్శలు గుప్పించాడు. ప్రాక్టీస్ చేయమని చెబితే.. 'ఇవాళ నేను మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయను' అని పృథ్వీ షా అన్నట్లుగా రికీ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఆ తర్వాత అక్కడా అవకాశాలు తగ్గిపోయాయి. గత సీజన్‌లో ఎవరూ అతడిని కొనుగోలు కూడా చేయలేదు.

### ఇలాగే ఉంటే..

ఓవైపు భారత జట్టులోకి రావాలంటే పోటీ చాలా తీవ్రంగా ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్ల విషయంలో చాలా కఠినంగా ఉంటాడని తెలుసు కదా.. ఇలాంటప్పుడు కూడా 'వివాదాస్పద' ప్రవర్తనతో ఉంటే జాతీయజట్టులోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాలు మూసుకుపోతాయనేది క్రీడా పండితుల విశ్లేషణ. ఓవైపు ఆట పరంగా మరింత ఉన్నతంగా మారాల్సింది పోయి.. రోజుకో వివాదంతో వార్తల్లోకి వస్తే క్రికెట్ కెరీర్‌పై తీవ్ర ప్రభావం పడటం ఖాయం. భారీ సెంచరీ చేసిన ఆనందం లేకుండా చేసుకున్నాడు. ఇదే కొనసాగితే మున్ముందు దేశవాళీలోనూ ఛాన్స్‌లు రావడం కష్టమే. ఇప్పుడు భారత క్రికెట్‌లో ఇలా 'వివాదాలు' తలకెత్తుకున్న క్రికెటర్లు లేరేమో!


# 4 రోజుల వరుస లాభాలకు బ్రేక్..

## నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి నష్టాలకు పరిమితమయ్యాయి. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. క్యూ2 ఫలితాల సీజన్ త్వరలో ప్రారంభం కానుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి.

సెన్సెక్స్ ఉదయం 81,899.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,926.75) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే 82,257.74 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇలా రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. చివరికి 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62.15 పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔను 4043.76 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఆస్ట్రేలియా క్రికెట్‌ను వదిలేస్తే

# చెరో రూ.58 కోట్లు..

### ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆఫర్!

సోషల్ మీడియాతోపాటు క్రికెట్ వర్గాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఆస్ట్రేలియా కెప్టెన్‌తోపాటు ఆ జట్టు డేంజరస్ బ్యాటర్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ మొత్తం ఆఫర్ చేసిందని.. అందుకోసం ఓ షరతు విధించినట్లు కథనాలు వస్తున్నాయి. ఇంతకీ ఆ ఆటగాళ్లు ఎవరు? ఆఫర్ ఏంటో ఓ లుక్కేద్దాం... ఆస్ట్రేలియా టెస్టు జట్టు సారథి పాట్ కమిన్స్, ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ఐపీఎల్‌కు చెందిన ఓ ఫ్రాంచైజీ రూ. 58 కోట్లు (10 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్లు) చొప్పున ఇచ్చేందుకు ఆఫర్ చేసింది. అయితే, ఆ మొత్తం అందుకోవాలంటే ముందు ఆస్ట్రేలియా క్రికెట్ నుంచి బయటకు రావాల్సి ఉంటుంది. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కాకుండా.. తమ ఫ్రాంచైజీకి చెందిన జట్ల తరఫున ఇతర టీ20 లీగుల్లోనూ ఆడాల్సిఉంది. జాతీయ జట్టు తరఫున ఆడకుండా.. ఫ్రాంచైజీకి వస్తున్నందుకే ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏడాది పొడవునా లీగులు ఉండటంతో ఫ్రాంచైజీకీ ఆ ధర బాగానే వర్కౌట్ అవుతుందనేది క్రికెట్ వర్గాల అంచనా. అయితే, వారిద్దరూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా, రాష్ట్రాల క్రికెట్ సంఘాలు, ప్లేయర్ల యూనియన్‌లోనూ చర్చించాల్సి ఉంది.

### ఇప్పటివరకు ఎంత వస్తుందంటే?

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న పాట్ కమిన్స్‌ను ఏడాదికి రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. ప్రస్తుతం అతడే ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ అనే సంగతి తెలిసిందే. ఇక క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఏడాదికి కాంట్రాక్ట్ రూపంలో రూ. 8.74 కోట్లు వస్తాయి. ప్రస్తుతం అతడు టెస్టు, వన్డేలకు సారథిగా ఉన్నాడు. తమ జాతీయ బోర్డు నుంచి అన్నీ కలుపుకొని రూ. 17.50 కోట్ల వరకూ వస్తాయి. ఇతర ఫ్రాంచైజీల్లోనూ ఆడినప్పటికీ ఇంత మొత్తం రాదు. ఐపీఎల్‌తో వచ్చే ఆదాయం కలిపి సుమారు రూ. 35 నుంచి 40 కోట్ల వరకూ అందుతాయి.

### రెండేళ్లు ఏంటి.. మరో నాలుగేళ్లు ఆడేంత 'నాజూగ్గా'!

ట్రావిస్ హెడ్ విషయంలో ఈ మొత్తం కాస్త తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఎస్ఆర్‌హెచ్ అతడిని రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి రూ. 8.70 కోట్లు వస్తాయి. ఇతర లీగుల్లోనూ ఆడినప్పటికీ ఈ మాత్రం మొత్తం రాదు. ఏడాదికి ట్రావిస్ హెడ్ సుమారుగా రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకూ తీసుకుంటాడు. ఇప్పుడు ఆ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఇస్తామన్న రూ.58 కోట్ల ఆఫర్ కమిన్స్‌తో పోలిస్తే హెడ్‌కే ఎక్కువ బెనిఫిట్ అవుతుంది.



# విశాఖలో పరుగుల వరదే!

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: వన్డే ప్రపంచకప్ తొలి రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించని పిచ్‌లతో కాస్త ఇబ్బంది పడింది భారత మహిళల జట్టు. అయితే మూడో మ్యాచ్‌లో బ్యాటర్లకు సమస్యలేమీ ఉండకపోవచ్చు. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో పిచ్ బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా ఉండబోతోంది. మామూలుగానే ఇక్కడి పరిస్థితులు బ్యాటర్లకు బాగా సహకరిస్తాయి. ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం పిచ్‌ను మరింతగా బ్యాటింగ్‌కు అనుకూలించేలా రూపొందించినట్లు సమాచారం. ఇక్కడ భారీ స్కోర్లు నమోదవడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పిచ్‌పై స్పిన్నర్ల ప్రభావం కూడా బాగానే ఉంటుంది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌ను గువాహటిలో ఆడిన భారత్.. బౌలర్లకు సహకరించిన పిచ్‌పై ఇబ్బంది పడింది. 124 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. తర్వాత అమన్‌జ్యోత్, దీప్తి శర్మల పోరాటంతో పుంజుకుని శ్రీలంక ముందు 270 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. బౌలర్ల ప్రతిభతో ఆ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించింది.

తర్వాత కొలంబోలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో పిచ్ మరీ నెమ్మదిగా ఉండడంతో భారత్ మరింత తడబడింది. అతి కష్టం మీద 247 పరుగులు చేయగలిగింది. ఇక్కడ కూడా బౌలర్లు విజృంభించడంతో భారత్ పైచేయి సాధించింది. విశాఖ పిచ్‌పై మాత్రం స్కోరు 300 దాటితే ఆశ్చర్యం లేదు. ఇక్కడ భారత్ వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గురువారం దక్షిణాఫ్రికాతో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన.. ఆదివారం ఆస్ట్రేలియాను ఢీకొంటుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఈ మ్యాచ్‌ల్లో చెలరేగుతారని జట్టు ఆశిస్తోంది. అయితే బ్యాటింగ్ పిచ్‌పై ప్రత్యర్థి జట్ల బ్యాటర్లూ దూకుడుగా ఆడే అవకాశముంది కాబట్టి.. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయాల్సిందే.

For a pure tomorrow.. జయహో

## 'కమిటీ కుర్రోళ్లు' కాంబో
# మరోసారి రిపీట్

గతేడాది చిన్న చిత్రంగా విడుదలై మంచి హిట్ అందుకున్న 'కమిటీ కుర్రోళ్లు' కాంబో మరోసారి రిపీట్ కానుందా! అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించిన యువ దర్శకుడు యదు వంశీ మరోసారి పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై సినిమా చేయనున్నారు. నిహారిక కొణిదెల నిర్మించనున్నారు. 2026లో ఈ మూవీ సెట్స్ పైకి



వెళ్లనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. 'కమిటీ కుర్రోళ్లు' మూవీతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్ తెలుగు సినిమాకు పరిచయమయ్యారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా రూ.24.5 కోట్ల వసూళ్లను సాధించింది. అవార్డుల రేసులోనూ సత్తా చాటింది. సైమా, గద్దర్ అవార్డుల్లో సత్తా చాటింది. మరోవైపు నిహారిక కొణిదెల నిర్మిస్తున్న మరో చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్నారు.



# మాస్ జాతర నుంచి మరో పాట


రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.



# ఓటిటిలోకి వార్-2



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ప్లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



## మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా హెగ్డే

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

## కాంతారా ఎఫెక్ట్ కోసం చాలా కష్టపడ్డాం





### సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్

ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిత్రం 'కాంతార: చాప్టర్1. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ కథ, కథనాలతోనే కాకుండా, విజువల్స్ పరంగానూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా టైగర్ సీక్వెన్స్, యాక్షన్ సన్నివేశాలు, రథంపై యుద్ధం, సహజమైన అడవుల్లో తీర్చిదిద్దిన సన్నివేశాలు సినిమాకు ఫ్రెష్‌లుక్‌ను తీసుకొచ్చాయి. ఈ విజువల్ వండర్ వెనక రిషబ్‌శెట్టి విజన్‌తో పాటు, సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్ విజన్ కూడా ఉంది. తాజాగా ఈ సినిమా మేకింగ్ వెనక ఉన్న ఆసక్తికర విషయాలను అరవింద్ పంచుకున్నారు. కాంతార: చాప్టర్1' 95 శాతం చిత్రీకరణ కర్ణాటకలోని కుందాపురలోనే తీశాం. దాదాపు రెండేళ్ల పాటు చిత్రబృందం అంతా అక్కడే ఉంది. షూటింగ్ జరిగినన్ని రోజులు ఒత్తిడి, నిద్ర లేని రాత్రులు గడిపాం. కానీ, సవాళ్లు స్వీకరించినప్పుడే అసలైన ప్రతిభ బయటపడుతుంది. రోజూ నేను లైట్లతో ప్రయోగాలను చేసేవాడిని. దర్శకుడు అనుకున్నట్లు సీన్ వచ్చేవరకూ ఏ విషయంలోనూ అస్సలు వెనక్కి తగ్గేవాళ్లం కాదు. అటవీ ప్రాంతంలో సరైన లైటింగ్ ఎఫెక్ట్ రావడానికి ఒక్కోసారి వారాల సమయం పట్టేదన్నారు.

# విదేశాలకు వెళ్లాలా..? ముందు రూ.60 కోట్లు కట్టండి

### శిల్పాశెట్టికి బాంబే హైకోర్టు షాక్

లఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి విచారణ జరుగుతోంది. మరోవైపు వీరికి ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం లుకౌట్ నోటీసులు(ఎల్‌వోసీ) జారీ చేసింది. ఈ క్రమంలో శిల్పాశెట్టి దంపతులు విదేశీ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. విదేశాలకు వెళ్లేందుకు నటి శిల్పాశెట్టి దంపతులకు అనుమతి నిరాకరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలంటే ముందు రూ.60కోట్లు డిపాజిట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను పాటించిన తర్వాత తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపింది. ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శిల్పాశెట్టి అక్టోబరు 25-29 తేదీల మధ్యలో కొలంబో వెళ్లాల్సి ఉంది. లుకౌట్ నోటీసులు ఉన్న నేపథ్యంలో ఆమె కోర్టును ఆశ్రయించారు. 'ఈవెంట్ నిర్వాహకుల నుంచి ఏమైనా ఆహ్వానం ఉందా?' అని కోర్టు శిల్ప లాయర్‌ను ప్రశ్నించగా, ప్రస్తుతం కేవలం ఫోన్‌కాల్ ద్వారా మాత్రమే సమాచారం తెలియజేశారని, కోర్టు అనుమతి ఇస్తే, అధికారికంగా ఆహ్వానం అందుతుందని తెలిపారు.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com